Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 116 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

మంగళవారం, 11 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## అందెశ్రీ మృతి మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు : ప్రధాని

**హైదరాబాద్/న్యూఢిల్లీ, (రాజధాని వార్తలు):** ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాని స్పందిస్తూ.. అందెశ్రీ మృతి మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటన్నారు. ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు అందెశ్రీ గొంతుకగా నిలిచారని అన్నారు. అందెశ్రీ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రధాని మోడీ ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

**మోడీ ట్వీట్**

'అందె శ్రీ మరణం మన సాంస్కృతిక, మేధో ప్రపంచంలో పూడ్చలేని లోటు. ఆయన ఆలోచనలు తెలంగాణ ఆత్మను ప్రతిబింబిస్తాయి. ఒక గొప్ప కవి, మేధావి అయిన ఆయన, ప్రజల పోరాటాలకు, ఆకాంక్షలకు, అకుంఠిత స్ఫూర్తికి గొంతుకగా నిలిచారు. ఆయన పదాలకు హృదయాలను కదిలించే శక్తి, అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను ఏకం చేసే శక్తి, ప్రజల సాంఘిక




హృదయ స్పందనకు రూపం ఇచ్చే శక్తి ఉన్నాయి. ఆయన సామాజిక స్పృహను, సాహితీ సౌందర్యంతో మిళితం చేసిన విధానం అద్వితీయం. వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అంటూ ప్రధాన మోడీ తెలుగులో ట్వీట్ చేశారు.

## ఢిల్లీ సమీపంలో భారీగా ఆయుధాలు స్వాధీనం.. దర్యాప్తు ముమ్మరం



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీ సమీపంలో ఉగ్రవాదులకు సంబంధించిన ఆయుధాలు భారీ ఎత్తున లభ్యమయ్యాయి. హరియాణాలోని ఫరిదాబాద్‌లో 350 కిలోల అమ్మోనియం నైట్రేట్ సంబంధిత పేలుడు పదార్థాలు, ఒక రైఫిల్ సహా 20 టైమర్లను స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక పోలీస్ కమిషనర్ సతేందర్ కుమార్ గుప్తా వెల్లడించారు. వీటితో పాటు మూడు మ్యాగజైన్లు, పిస్టల్, వాకీటాకీ సెట్‌ను స్వాధీనపరచుకున్నట్టు ఆయన పేర్కొన్నారు.

**ఉగ్రసంస్థ పోస్టర్లు అంటించడంతో వెలుగులోకి..**

శ్రీనగర్‌లో అక్టోబర్ 27న జైష్-ఎ-మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పలు పోస్టర్లు వెలిశాయి. వీటిని కశ్మీర్‌కు చెందిన వైద్యుడు ఆదిల్ అహ్మద్ రాథర్ వేసినట్టు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా పోలీసులు పసిగట్టారు. సదరు వ్యక్తి ఉత్తర్ ప్రదేశ్ సహరాన్‌పుర్‌లోని ఓ ఆస్పత్రిలో వైద్యుడిగా సేవలందిస్తున్నట్టు పోలీసులు తెలిపారు. అతణ్ని గత వారం అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. నిందితుడు గతేడాది అక్టోబర్ ముందువరకూ అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విధులు నిర్వర్తించాడని, అక్కడ అతని లాకర్‌ను తనిఖీ చేయగా ఒక రైఫిల్ దొరికిందని తెలిపారు. అతను ఇచ్చిన సమాచారం ప్రకారమే ఫరిదాబాద్‌లో ఈ రికవరీ జరిగినట్టు వెల్లడించారు. నిందితుడు రాథర్ చెప్పిన ప్రకారం.. ముజామ్మిల్ షకీల్ అనే మరో డాక్టర్ వద్ద కూడా పేలుడు పదార్థాలు, ఆయుధ సామాగ్రి నిల్వ ఉన్నట్టు తేలింది. దీంతో పుల్వామాకు చెందిన షీకల్‌నూ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు ఫరిదాబాద్‌లోని ఆల్-ఫలాహ్ ఆస్పత్రిలో పనిచేస్తున్నాడు.

**లేడీ డాక్టర్ కారులో..**

ఈ ఘటనకు సంబంధించి ఓ మహిళా వైద్యురాలి కారులో ఒక రైఫిల్, పిస్టల్ బయటపడ్డాయి. ఆమె మందుగుండు సామాగ్రిని నిల్వచేసేందుకు వినియోగించిన కారును స్వాధీనం చేసుకున్న దర్యాప్తు అధికారులు.. ఆమెపై విచారణ చేపట్టారు.

## విశాఖలో పెట్టుబడుల సదస్సు.. తొలిరోజు చర్చించే అంశాలివే

**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖలో ఈనెల 14, 15 తేదీలలో జరిగే 30వ పార్టనర్ షిప్ సమ్మిట్‌కు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. పార్టనర్ షిప్ సమ్మిట్‌పై సోమవారం ఏపీ కేబినెట్ సమావేశంలోనూ చర్చకు వచ్చింది. ఈనెల 14న తొలిరోజు ఓపెనింగ్ ప్లీనరీతో సదస్సు ప్రారంభం కానుంది. ఓపెనింగ్ ప్లీనరీలో తీవ్రమైన ప్రతికూల పరిస్థితులు, ఆర్థిక మందగమనం ఉన్నప్పటికీ భారత్ 65 శాతం వృద్ధి రేటును సాధించిన అంశంపై చర్చ జరుగనుంది. రెండు రోజుల పాటు జరిగే సదస్సులో కేంద్రం ప్రభుత్వం నుంచి మంత్రులు నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, అశ్వినీ వైష్ణవ్, అన్నపూర్ణాదేవి, జితేంద్ర సింగ్‌లు హాజరుకానున్నారు. అలాగే ఈ సదస్సుకు 45 దేశాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన 8 మంది స్పీకర్‌లు ఈ సదస్సులో పాల్గొంటారు. పార్టనర్ షిప్ సమ్మిట్‌లో ఒక ప్లీనరీ సెషన్, సీఐఐ ద్వారా జరిగే టెక్నికల్ సెషన్లు 27, రాష్ట్ర స్థాయిలో సీఐఐతో కలిసి సంయుక్తంగా 11 సెషన్‌లు



జరుగనున్నాయి. దేశీయ అంశాలతో 5 సెషన్‌లు, ఒక వీడ్కోలు సెషన్‌లతో సదస్సుకు ఏర్పాట్లు జరుగు తున్నాయి. ఈ సదస్సు ద్వారా 9 లక్షల 76 వేల 248 కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా వేయగా.. దాదాపు 7 లక్షల 48 వేల 427 మందికి ఉద్యోగావకాశాలు లభించే అవకాశం ఉంది. ఈ సదస్సులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 30 ప్రాజెక్టులు ప్రారంభిం చనుండగా, 82 ప్రాజెక్టులకు శంఖుస్థాపనకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

## మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కొలుసు పార్థసారధి

**- 2026-2027 రెండేళ్ళ కాలానికి అక్రిడిటేషన్లు జారీ - మీడియా సంస్థల నుండి ధరఖాస్తులు ఆహ్వానం**



**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు 2026-2027 రెండేళ్ళ కాలపరిమితితో కూడిన అక్రిడిటేషన్లు జారీ చేసేందుకు సంబంధించి మీడియా రిలేషన్స్ పోర్టల్ (వైబ్ సైట్)ను సోమవారం సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖామాత్యులు కొలుసు పార్థసారధి లాంచనంగా ప్రారంభించారు. ఈ మేరకు ఎపి సచివాలయం ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో మీడియా రిలేషన్స్ వెబ్ సైట్‌ను సమాచారశాఖ సంచాలకులు కెఎస్.విశ్వనాధన్‌తో కలిసి ప్రారంభించారు. గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈనెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో రానున్న 2026-2027 రెండేళ్ల కాలానికి నూతన అక్రిడిటేషన్లు జారీకి వివిధ మీడియా సంస్థల్లో పనిచేసే ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల నుండి ధరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతోంది.రాష్ట్ర మరియు జిల్లాస్థాయి అక్రిడిటేషన్లకై అర్హులైన మీడియా ప్రతినిధులు అందరూ ఈపోర్టల్‌లో ధరఖాస్తు చేసుకోవచ్చును. ఈ పోర్టల్‌లో ధరఖాస్తు చేసుకున్న జర్నలిస్టులు తమ అప్లికేషన్ స్టేటస్ ఏ దశలో ఉందో కూడా ఈవైబ్ సైట్ ద్వారా తెల్సుకోవచ్చును. ఈ పోర్టల్‌లో ఏవిధంగా ధరఖాస్తు చేసుకోవాలనే విధి విధానాలను మంగళవారం ప్రత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడం జరుగుతుంది.

## కేబినెట్ భేటీ.. సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలోని పేదలందరికీ గృహ సదుపాయం కల్పించే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. నివాస స్థలం లేని వారందరి అర్హుల జాబితా రూపొందించి అందరికీ హౌస్ సైట్స్ దక్కేలా చూడాలన్నారు. సంవత్సరంలోగా నివాస స్థలం లేని వారికి లబ్ది చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలని సూచించారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్చార్జ్ మంత్రులు చొరవ చూపాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం విషయంలో జాప్యం తగదని అన్నారు. త్వరితగతిన సమస్యల పరిష్కారానికి సరైన విధానం రూపొందించాలని సూచిం చారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సోమవారం నాడు మంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు అంశాలపై మంత్రులతో సుధీర్ఘంగా చర్చలు జరిపారు సీఎం చంద్రబాబు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై మంత్రులకు దిశానిర్దేశం చేశారు. వైజాగ్ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియజేయాలని సీఎం చంద్రబాబు అన్నారు. పాఠశాలల్లో వాళ్లకు ఎవరికైన ఆసక్తి ఉంటే వాళ్ళు ఈ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ చూసే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందుకోసం మంత్రులు పనిచేయాలన్నారు. పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు ఉప రాష్ట్రపతి వస్తున్నారని.. పుట్టపర్తిని ఆధ్యాత్మిక కేంద్రంగా చేయాలని సూచించారు. ఈ సమ్మిట్‌కు ప్రెసిడెంట్, ప్రధాని, వైస్ ప్రెసిడెంట్, గవర్నర్లు, ముఖ్యమంత్రులు, చాలామంది వస్తున్నారని చెప్పారు. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే.. ఇన్‌చార్జి మంత్రులు జోక్యం చేసుకుని సరిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ విషయాన్ని కూటమి ఎమ్మెల్యేలకు మంత్రులే వివరంగా చెప్పాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు. రాష్ట్రంలో రెవెన్యూ సమస్యలు ఎజెండాగా పెట్టుకుని ఇంచార్జి మంత్రులు పరిష్కారం చేయాలని ఆదేశించారు. అనంతపురంలో రెవెన్యూ సమస్యలను రెవెన్యూ అధికారులందరూ కూర్చోబెట్టి పరిష్కారం చేశారని గుర్తు చేశారు. అనేక వివాదాలకు సంబంధించి రెండు పార్టీలు రాజీ పడినప్పటికీ కొంతమంది ప్రజాప్రతినిధులు ఒప్పుకోవడం లేదన్నారు. మంత్రులు ఈ విషయమై ఎమ్మెల్యేలందరికీ గట్టిగా చెప్పాలని అన్నారు. ఎర్ర చందనం విషయంలో పవన్ కళ్యాణ్ చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన ఆక్రమణలను తాను హెలికాప్టర్ నుంచి వీడియో తీశానని చెప్పారు. త్వరలోనే ఈ వీడియో రిలీజ్ చేస్తానని తెలిపారు.

## చిన్మయ మిషన్ రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీలు – 2025





**కడప/నెల్లూరు, (రాజధాని వార్తలు):** చిన్మయ మిషన్-కడప, శ్రీ లలిత పంచాయతన ఆలయంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. ఈ పోటీలలో ఉభయ తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాల నుండి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలలో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా,ఇందుకూరుపేట మండలం, కొత్తూరు గ్రామంలోని జివికె చిన్మయ విద్యాలయ విద్యార్థి చిరంజీవి యద్దల ఇశాంత్ రెడ్డి, ఈ గ్రూప్ విభాగం నుండి రాష్ట్రస్థాయి గీతా పఠన పోటీలలో రెండవ బహుమతిని గెలుచుకొన్నారు. విద్యార్థి ఇశాంత్ రెడ్డిని మరియు తల్లిదండ్రులైన యద్దల బాలకోటారెడ్డి మరియు శారదకు జివికె చిన్మయ విద్యాలయ యాజమాన్యం జి.గీర్వాణి, కరస్పాండేంట్ హరిత, ప్రిన్సిపాల్ బసివి రెడ్డి అభినందనలు తెలియచేశారు. రాష్ట్రస్థా యిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన విద్యార్థులు మహారాష్ట్ర, పూణే చిన్మయ విభూతిలో జరగబోయే భారత దేశ స్థాయి చిన్మయ గీతా పఠన పోటీలలో పాల్గొననున్నారు. ఈ పోటీలలో పాల్గొననున్న విజేతలకు విద్యాలయ జోనల్ డైరెక్టర్ స్వామి సువీరానంద, చిన్మయ మిషన్ బ్రహ్మచారి హరీష్ చైతన్య అభినందనలు మరియు శుభాశీస్సులను అందజేశారు.



**అన్న క్యాంటీన్ నిర్మాణం సీడ్ యాక్సిస్ రోడ్ E3-N9 జంక్షన్ సీఆర్డీఏ హెడ్ ఆఫీస్ ముందుగా రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామం, అమరావతిలో శరవేగంగా జరుగుతోంది**

**- ఫోటో సేకరణ - యస్ ఆర్ ఆర్**

# మూడో రోజు వైభవోపేతంగా సత్యనారాయణ స్వామి వ్రతం

**- 501 మంది దంపతులచే సత్యనారాయణస్వామి వ్రతం - మంత్రయుక్తంగా నిర్వహించిన చండీ హోమం - భారీగా తరలి వచ్చిన భక్తులు - అన్నదానంలో భక్తులకు స్వయంగా వడ్డించిన ఎంపీ వేమిరెడ్డి - పూజల్లో పాల్గొన్న భక్తులు, తీర్థ ప్రసాదాల అందజేత**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని వి.ఆర్. సి మైదానం వేదికగా నిర్వహిస్తున్న కార్తీక మాస లక్ష దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఉదయం.. విశేష చండీ హోమం, 501 మంది దంపతులచే సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి వ్రతం వైభవంగా నిర్వహించారు. మైదానానికి చేరుకున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, శ్రీశైల దేవస్థాన ప్రత్యేక ఆహ్వానితులు వేమిరెడ్డి కోటారెడ్డి దంపతులకు అర్చకులు స్వాగతం పలికారు. యాగశాలలో వేద పడింతుల మంత్రోచ్ఛరణల మధ్య విశేష చండీ హోమం నిర్వహించారు.

వేదికపై ఏర్పాటు చేసిన శ్రీ సత్యనారా యణ స్వామివారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతానికి భారీ సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. 501 మంది దంపతులకు ప్రశాంతిరెడ్డి చేతులమీదుగా ప్రసాదాలు అందజేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య సత్యనారాయణ వ్రతం జరిగింది. అనంతరం భక్తులకు వి.ఆర్.సి మైదానంలో అన్నదానం చేశారు. ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్వయంగా భక్తులకు అన్నం వడ్డించారు. అన్నదాన కార్యక్రమంలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో కార్తీక మాస లక్ష దీపోత్సవ కమిటీ సభ్యులు భాస్కర్ శర్మ, ప్రభాకర్‌రావు, గంధం సునీల్, విజయసారధి, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జనన్యా జన్మదినాన్ని పురస్కరించుకొని స్వాన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పేషెంట్‌కు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం











**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని నోవా బ్లడ్ బ్యాంక్ సెంటర్ నందు శివాజీ యూత్ ఫౌండేషన్ చైర్మన్ మోపూర్ భాస్కర్ నాయుడు కుమార్తె మోపూరు జనన్యా జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి నెల స్వాన్ సంస్థ నిర్వహిస్తున్న క్యాన్సర్‌తో బాధపడుతూ ఉండే క్యాన్సర్ కౌగిలి పేషెంట్‌కి నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ఏఆర్ అడిషనల్ ఎస్పీ కొల్లూరు శ్రీనివాసరావు చేతుల మీదుగా క్యాన్సర్ పేషెంట్‌కి నిత్యావసర సరుకులు ఆర్థిక సహాయాన్ని అందజేయడం జరిగింది. ఈ కార్య క్రమంలో ఫ్యాన్ అధినేత నీలకంఠం భానుతేజ రెడ్డి, చందు, షమ్ము, సుభాన్, గిరి, జన, బాబు, తదితరులు పాల్గొన్నారు.

# పల్లిపాళెం ఉప్పుటేరు బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు కేటాయించండి

**- మొంధా తుఫానుకు దెబ్బతిన్న కాలువల మమత్తులకు ఏప్డిఆర్ నిధులు మంజూరు చేయండి**
**- 2021లో నివార్ తుఫాను విధ్వంసం తాలూకు పెండింగ్ పనులను పూర్తి చేయండి**
**- బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్ నిర్మాణానికి నిధులివ్వండి**
**- జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ ఎం డి ఫరూఖ్‌కు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వినతి**



**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇందుకూరు పేట మండలంలోని సముద్ర తీరప్రాంత గ్రామాలను అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించే గంగపట్నం పల్లిపాళెం బ్రిడ్జ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలంటూ జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎన్ ఎం డి ఫరూఖ్‌కి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మెమొరాండం అందచేశారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో పాల్గొనేందుకు నెల్లూరు నగరానికి విచ్చేసిన మంత్రి ఎన్ ఎం డి ఫరూఖ్‌ని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా పల్లిపాళెం ఉప్పుటేరు బ్రిడ్జ్ నిర్మాణానికి 14 కోట్ల 60 లక్షల రూపాయలు మంజూరు చేయవలసిందిగా ఆమె అంచనాలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. 2021 లో నివార్ తుఫాను కారణంగా కోవూరు నియోజకవర్గంలో విధ్వంసం అయిన పొర్లు కట్టలు, సాగునీటి కాలువలో విధ్వంసం తాలూకు పలు పనులు ఇంకా పెండింగ్‌లో వున్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ఇటీవల మొంధా తుఫాను కారణంగా దెబ్బతిన్న కాలువల మమత్తులకు ఏప్డిఆర్ నిధులు మంజూరు చేయాలని పేర్కొన్నారు. బుచ్చిరెడ్డి పాళెం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న షాదీమంజిల్ నిర్మాణానికి పూర్తి చేసి కోవూరు నియోజకవర్గ వ్యాప్తంగా 5 మండలాలలో ముస్లిం శ్మశాన వాటికలు మరియు మసీదులలో మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

# "నిరసన ర్యాలీలు జయప్రదం చెయ్యండి" : కాకాణి







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ నవంబర్ 12న నిర్వహిస్తున్న నియోజకవర్గాల వారీగా ప్రజా ఉద్యమ ర్యాలీ పోస్టర్ ను మాజీ మంత్రి మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సమక్షంలో మాజీ మంత్రివర్యులు నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేతులు మీదుగా ఆవిష్కరించారు. శాసనమండలి సభ్యులు మేరీగ మురళీధర్ తూమాటి మాధవ రావు రాష్ట్ర మాజీ డైరీ డెవలప్మెంట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ వీరి చలపతి అనుబంధ సంఘాల అధ్యక్షులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అనేక రకాల నిరసన కార్యక్రమాలను చేపట్టింది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాలలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ఉద్యమ రూపంలో కొనసాగుతుంది. ప్రజల్లో జగన్మోహన్ రెడ్డి తెచ్చిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన జ్వాలలు ఎగిసిపడుతున్న చంద్రబాబు పట్టించుకోవడం లేదు. చంద్రబాబు ప్రజల సొమ్మును ప్రైవేట్ వ్యక్తులకు దోచిపెడుతున్నాడు. చంద్రబాబు ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది. జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో ప్రజల నుండి సేకరించిన కోటి సంతకాలను రాష్ట్రానికి రాజ్యాంగ నేత అయిన గవర్నర్‌కి అందించి, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయకుండా అడ్డుకోవాలని కోరుతాం. భారీ వర్షాలు, తుఫాన్ కారణంగా వాయిదా పడిన నియోజకవర్గాల వారి ప్రజా ఉద్యమ ర్యాలీలను ఈనెల 12వ తేదీ అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్నాం. చంద్రబాబు ప్రజా వ్యతిరేక పాలన ప్రజల్లో తీసుకొని వెళ్లాలని ఉద్దేశ్యంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజా ఉద్యమ ర్యాలీ అన్ని నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తుంది. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, కందుకూరు నియోజకవర్గంతో సహా, అన్ని నియోజకవర్గాల్లో ప్రజా ఉద్యమ ర్యాలీలు జరుగుతాయి. వైయస్సార్సీపీ ప్రజా ఉద్యమ ర్యాలీలో విద్యార్థులు, తల్లి దండ్రులు, మేధావులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ పాల్గొని, చంద్రబాబు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సహకరించాలని కోరుతున్నాం. చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం పై వెనుకకు తగ్గేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది.

# 15 నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు ఐఎబి సమావేశంలో నిర్ణయం








**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో ఖరీఫ్ 2025-26 సంవత్సరానికి ఈనెల 15వ తేదీ నుంచి సాగునీటిని విడుదల చేసేందుకు ఐఎబి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. శనివారం ఉదయం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు, శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణా రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో వ్యవసాయ అవసరాలు, తాగునీటి అవసరాలకు కేటాయించాల్సిన నీటి కేటాయింపులపై మంత్రులు చర్చించారు. రైతు సంఘాల నాయకులు, ప్రాజెక్టు కమిటీల సభ్యులు అందరి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి చల్లనిచూపు చూడడంతో ఈ ఏడాది జిల్లాలోని జలశయాలు, చెరువులు, పంటకాలువల్లో పుష్కలంగా నీరు వుందన్నారు. సాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. ఈ మేరకు జిల్లాలో 2025-2026 ఖరీఫ్ సాగుకు సంబంధించి సుమారు 5 లక్షల ఎకరాలకు 50టిఎంసీల నీటిని విడుదల చేసేందుకు, కండలేరు జలాశయం నుంచి నెల్లూరు, తిరుపతి జిల్లాలకు తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా 2,23,333 ఎకరాలకు 22.333 టిఎంసీల నీటిని మొత్తం సుమారు 7.30 లక్షల ఎకరాలకు 73 టిఎంసీల నీటి కేటాయింపులు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారని, సభ్యులందరూ ఆమోదం తెలపాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రతిపాదించారు. ఇందుకు అందరూ ఆమోదం తెలిపారు. ఈ మేరకు నీటి కేటాయింపులకు ఐఎబి సమావేశం ఆమోదించినట్లు ఇన్‌చార్జి మంత్రి ఫరూక్ పేర్కొన్నారు. సోమశిల జలాశయం పరిధిలోని పెన్నార్ డెల్టా, కనుపూరు కాలువ, కావలి కాలువ, జికెఎన్ కాలువ, దక్షిణకాలువలకు, కండలేరు జలాశయం పరిధిలోని తెలుగుగంగ ప్రాజెక్టు ద్వారా కెఆర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్, యస్‌యస్‌జి కెనాల్ (నెల్లూరు,తిరుపతి)కు సాగునీటి, తాగునీటి అవసరాల కోసం ఈనెల 15వ తేదీ నుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి ఫరూక్ చెప్పారు. ఏ ఒక్క రైతుకు కూడా ఇబ్బందులు లేకుండా సాగునీటి కేటాయింపులు జరిపినట్లు చెప్పారు. తొలుత సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ కనుపూరు కాలువ కింద ఆయకట్టును కచ్చితంగా లెక్కించి సాగునీటిని విడుదల చేయాలని సూచించారు. సోమశిల అఫ్రాన్ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకో వాలన్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ లష్కర్లకు జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని, కాలువల్లో పూడికతీత పనులు పూర్తి చేయించాలని మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. గండిపాలెం ప్రాజెక్టు మెయింటెనెన్స్ కూడా పట్టించుకోవడం లేదని, దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టాలని, మెట్టప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గంలో ఇరిగేషన్ పనులు జరిగేలా చూడాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. కావలి, కందుకూరు ఎమ్మెల్యేలు కృష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు కూడా ఆయా నియోజకవర్గాల్లో పలు ఇరిగేషన్ మెయింటెనెన్స్ పనులు త్వరగా పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటే శ్వర్లు, జడ్పీ ఇన్‌చార్జి సిఇవో శ్రీధర్‌రెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ దేశ్ నాయక్, సోమశిల ఎస్ఈ వెంకటరమణా రెడ్డి, తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఇ జికె సుబ్రహ్మణ్యం, అధికారులు పాల్గొన్నారు.

# కర్నూలు ఇ-టెక్నో స్కూల్‌ను సందర్శించిన విబిఆర్




**కర్నూలు, (రాజధాని వార్తలు):** కర్నూలు నగరంలోని ఎల్కూర్ బంగ్లా నందుగల నారాయణ ఇ టెక్నో స్కూల్‌ను శనివారం నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ సిబ్బంది వేమిరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికి సత్కరించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, బోధన పద్ధతులు వివిధ అంశాలపై విబిఆర్ సిబ్బందితో చర్చించారు ప్రిన్సిపాల్, ఏజీఎం, ఉపాధ్యాయులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# వేమిరెడ్డి దంపతులకు శివాశీస్సులు మెండుగా ఉండాలి

## - మంత్రి పొంగూరు నారాయణ - పదేళ్లుగా దిగ్విజయంగా కార్తీక మాస లక్ష దీపోత్సవం - ప్రజలకు అంతా మంచే జరగాలి









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** కార్తీకమాసం సందర్భంగా ఇంత గొప్ప కార్యక్రమం నిర్వహిస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు ఆ పరమశివుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ప్రజలకు కార్తీకమాస ఫలితాలను అందించేందుకు కార్తీకమాస లక్ష దీపోత్సవం నిర్వహించడంపై ఆయన హర్షం వ్యక్తం చేసారు. లక్ష దీపోత్సవ కార్యక్రమంలో భాగంగా మూడో రోజు ఆయన పాల్గొని పండరీనాథ్, నాగేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన స్పటిక లింగానికి అభిషేకాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా ప్రజా క్షేమం కోసం ఇంతటి మహాకార్యాన్ని నిర్వహిస్తున్న నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులకు శివపార్వతుల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేస్తుండడం హర్షించదగ్గ విషయం అన్నారు. ఇంత వైభవోపేతంగా జరిగే కార్యక్రమం మరొకటి లేదని ఆయన వ్యాఖ్యానించారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వేమిరెడ్డి దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని కోరారు.

# "దళితుడు గోపాల్ గొంతు కోయడం దుర్మార్గం"







**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండల కేంద్రంలో టిడిపి నాయకుల గూండాల చేతిలో విచక్షణారహితంగా దాడిలో గాయపడి, ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొంది, ఇంటికి చేరుకున్న రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జాయింట్ సెక్రెటరీ గోపాల్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. వైకాపా రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ గోపాల్ పై హత్యాయత్నం దాడి జరగడం బాధాకరం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో నియంతృత్వ పాలన రాజ్యమేలుతుంది. చంద్రబాబు ప్రభుత్వం దళితులు గిరిజనులపై చిన్న చూపుతో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తుంది. గోపాల్ లాంటి దళిత యువకుడి రాజకీయ ఎదుగుదలని ఓర్వలేక హత్యా రాజకీయాలకు పూనుకుంటున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పాలి. ఎన్నడూ లేని విధంగా అన్యాయాన్ని ప్రశ్నిస్తే గొంతులు కోయడం దుర్మార్గం.

కూటమి ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి రక్షణ లేకుండా పోయింది. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెడుతూ, కక్ష సాధింపులకు పాల్పడుతూ, కూటమి ప్రభుత్వం కుతంత్రాలకు, కుట్ర రాజకీయాలకు పాల్పడుతుంది. కూటమి నేతలు నేడు అవలంభిస్తున్న నీచ సాంప్రదాయాలు, రానున్న రోజుల్లో వాటి పరిణామాలు వారి ఊహకు కూడా అందవని హెచ్చరిస్తున్నాం. గోపాల్ మంచి ఉత్సాహంతో దళితుల అభివృద్ధి కోసం పని చేసే యువ నాయకుడు. జగన్మోహన్ రెడ్డి అంటే ఎనలేని అభిమానం, గోవర్ధన్ రెడ్డి నాయకత్వంపై నమ్మకం కలిగిన వ్యక్తి. గోపాల్‌పై దాడి చేసి, గొంతు కోసేందుకు ప్రయత్నించిన వారిని కఠినంగా శిక్షించాలి. గోపాల్‌ను తమ సొంత బిడ్డలా చూసుకుంటూ, గోపాల్ కుటుంబానికి అండగా నిలుస్తున్న గోవర్ధన్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు. తిరుపతి పార్లమెంట్ సభ్యులు గురుమూర్తి ఆధ్వర్యంలో గోపాల్‌పై జరిగిన దాడి విషయంలో జాతీయ ఎస్టీ కమీషన్‌కు ఫిర్యాదు చేస్తాం. గోపాల్‌కు న్యాయం జరగని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ విభాగం న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తుంది. మాజీ మంత్రి కాకాణి మాట్లాడుతూ.. రాష్ట్ర వైసిపి దళిత యువ నాయకుడైన గోపాల్‌పై హత్యాయత్నం జరగడం హేయమైన చర్య. ప్రశాంతంగా ఉండే నెల్లూరు జిల్లాలో ఎన్నడూ లేని విధంగా, దుష్ట సంప్రదాయాన్ని కూటమి నేతలు తీసుకొని వచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా, దళితులు మాట్లాడితే దాడులు చేస్తూ, గొంతులు కోసే ప్రయత్నం చేస్తుంది. దోషులను, సూత్రధారులను, పాత్రధారులను కూడా శిక్షిస్తామని, పోలీసు అధికారులు హామీ ఇచ్చారు. పోలీసు అధికారులు దాడులకు పురమాయించిన వారిని ప్రధాన నిందితులుగా గుర్తించాలి. గోపాల్‌పై జరిగిన దాడి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తే, జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కాగానే పునర్విచారణ చేయిస్తాం. గోపాల్‌పై దాడి విషయంలో దోషులతోపాటు, వారిని కాపాడిన వారు కూడా, భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. గోపాల్‌పై దాడిలో అసలైన దోషులను శిక్షించేంతవరకు మా పోరాటం కొనసాగుతుంది. జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో నెల్లూరుకు విచ్చేసి, గోపాల్ కుటుంబానికి ధైర్యం చెప్పిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మికి హృదయపూర్వక ధన్యవాదాలు.

# మణికంఠ భక్త సేవ సమాజం వారి ఆధ్వర్యంలో భారీ అన్నదానం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని పప్పుల వీధి వినాయక గుడి దగ్గర ఆదివారం మణికంఠ భక్త సేవ సమాజం వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా మణికంఠ భక్త సేవ సమాజం వారి ఆధ్వర్యంలో అన్నదానం జరుగుతోంది ఈ సంవత్సరం కూడా అయ్యప్ప స్వాములకు. భక్తులకు వేలాది మందిగా వచ్చి వారికి అన్నదానం ఏర్పాటు చేయడం జరిగింది.

మా మణికంఠ భక్త సేవ సమాజం వ్యవస్థాపకులు నాగేశ్వరరావు స్వామి, వెంకటేశ్వర్లు స్వామి, సుధాకర్ స్వామి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మణికంఠ భక్త సేవ సమాజం ఇంకా మరెన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు వెళ్తామని తెలియజేశారు. ప్రతి సంవత్స రం పడిపూజ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాము. మణికంఠ భక్తి సేవ సమాజంకి సహకరించిన భక్తులకి మా శ్రేయోభిలాషులకి మా మిత్రులకి ధన్యవాదాలు తెలియజేశారు.

# "ప్రైవేటీకరణపై ఉద్యమం ఆగదు": కాకాణి పూజిత

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, వెంకటాచలం మండలం, కసుమూరు గ్రామ పంచాయతీలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ, వైయస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కాకాణి పూజిత. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో మేము సైతమంటూ, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. జగన్మోహన్ రెడ్డి కష్టపడి రాష్ట్రానికి తీసుకుని వచ్చిన మెడికల్ కళాశాలలను చంద్రబాబు పూర్తి చేయలేక, ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెబుతున్నాడు. జగన్మోహన్ రెడ్డి ప్రజలకు చేసిన మేలు ప్రజలకు అర్థమవుతుందని, ప్రజల్లో జగనన్నకు మంచి పేరు రాకూడదనే ఉద్దేశ్యంతో చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తుంది. చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలతో మోసం చేసినట్లే, మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో ప్రజలకు నష్టం చేకూరుస్తున్నారు. చంద్రబాబు తీసుకున్న ప్రైవేటీకరణ నిర్ణయంతో, పేద కుటుంబాలకు వైద్య విద్యతో పాటు, వైద్యాన్ని కూడా దూరం చేస్తుంది. ప్రజలు అనేక నిరసనలు తెలియజేస్తూ, వ్యతిరేకిస్తున్నా, చంద్రబాబు ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదు. మెడికల్ కళాశాలలను ప్రభుత్వమే నడపాలని డిమాండ్ చేస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనుకకు తీసుకుని, చేసిన తప్పును సరిదిద్దుకునేంతవరకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగుతుంది. జగనన్నకు అండగా, కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి మద్దతు తెలుపుతున్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

# మత్స్యకారులకు పెద్ద బోట్లు అందించి ఆదుకోవాలి

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలోని మత్స్యకారులకు హై పవర్ బోట్లు అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధికారులను కోరారు. నెల్లూరు నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జిల్లా ఇన్చార్జి మంత్రి మహమ్మద్ ఫరూక్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా రివ్యూ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కలెక్టర్ హిమాన్షు శుక్లా, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణా రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వ్యవసాయ శాఖపై సమీక్ష సందర్భంగా జిల్లాలో మట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారని, మట్టి పరీక్షల ఆధారంగా కేవలం వరి మాత్రమే కాకుండా ఇతర పంటలు వేసే అంశంపై కూడా దృష్టి సారించాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు వేస్తే రైతులకు లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు. అధికంగా వరి పంట వేసి నష్టపోయే బదులు ఇతర ప్రత్యామ్నాయ పంటలపై ఆలోచించాలన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అలాగే వరి అధికంగా పండే కోవూరు నియోజకవర్గంలో రెండు బయో ఇతనాల్ ప్లాంట్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారుల దృష్టికి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే హై పవర్ బోట్ల సమస్యతో ఇబ్బం దులు పడుతున్నారని సమావేశంలో స్పష్టం చేశారు. దీనికి పరిష్కా రంగా మత్స్యకారులకు 500 హెచ్‌పి సామర్థ్యం గల పెద్ద బోట్లను అందించాలని సూచించారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారులు మన జలాల పరిధిలోకి వచ్చినా వాటిని తరిమికొట్టేందుకు ఇవి ఉపయోగపడతాయన్నారు. మత్స్యకారులకు అధిక మత్స్య సంపద లభిస్తుందని పేర్కొన్నారు. బోట్లు కో-ఆపరేటివ్ పద్ధతిలో ఏర్పాటు చేసి అందిస్తే లబ్ధి చేకూరుతుందని వివరించారు.

# సంపాదకీయం

## బహుళ స్వరాల నేటి విమర్శ

కొంతమంది కవులు/ రచయితలు తాము చెప్పింది పరమ ప్రామాణికం అనే ఆలోచనతో, ఎటువంటి పరిశోధనాత్మక పద్ధతి లేకుండా, కేవలం వ్యక్తిగత అభిప్రాయాలను, సాధారణ ప్రకటనలను సిద్ధాంతాలుగా ప్రకటిస్తున్నారు. ఇది విమర్శకు నష్టం చేస్తుంది. సుంకర గోపాలయ్య రాసిన 'ప్రమాణాల్లేని నేటి విమర్శ' వ్యాసం (వివిధ: 03-11-2025) ఈ కోవలోని వ్యాసమే! ఈ వ్యాసంలో, గత పదిహేనేళ్లుగా తెలుగు విమర్శ స్తబ్ధతలో ఉందని, కొత్త సిద్ధాంతాలు లేవని, లోతైన విశ్లేషణ కొరవడిందని ఆవేదన వ్యక్తం చేశారు గోపాలయ్య. కట్టమంచి నుండి త్రిపురనేని వరకు సాగిన 'పద్ధతైన' విమర్శ ఆగిపోయిందని, నేటి విమర్శకులు కేవలం 'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు. వ్యాసంలో వ్యక్తమైన కొన్ని ఆందోళనలలో వాస్తవం ఉన్నప్పటికీ, సమకాలీన విమర్శనా రంగాన్ని పూర్తిగా 'ప్రమాణాలు లేనిదిగా' కొట్టిపారేయడం పొరపాటు. వాస్తవానికి, నేటి తెలుగు విమర్శ 'ప్రమాణాలు లేకపోవడం'తో బాధపడటం లేదుబీ అది 'ఏక ప్రమాణం' స్థానంలో 'బహుళ ప్రమాణాల' వైపు పరిణామం చెందింది. ఇది బలహీనత కాదు, ఆధునిక సమాజపు సంక్లిష్టతకు, సాహిత్యపు వైవిధ్యానికి అద్దం పట్టే పరిపక్వతకు సంకేతం. మూల వ్యాసంలో 'కొత్త సిద్ధాంతాలు లేవు' అన్న ప్రధాన ఆరోపణ అత్యంత విస్మయపరిచే వాదన. 'కొత్త సిద్ధాంతం' అంటే ఆకాశం నుండి ఊడిపడదుబీ ప్రపంచవ్యాప్తంగా వస్తున్న నూతన తాత్విక చింతనలను, సామాజిక శాస్త్ర సిద్ధాంతాలను మన సాహిత్యానికి అన్వయించి, మనదైన విమర్శనా పద్ధతులను నిర్మించుకోవడమే. ఆ దిశగా గత పదిహేనేళ్లలో జరిగిన, జరుగుతున్న కృషిని విస్మరించలేం. ఈ కాలంలో అస్తిత్వవాద విమర్శలు విస్తరించాయి. ఈ కోవలో దళిత, స్త్రీవాద, బీసీ, ప్రాంతీయవాద విమర్శలు కేవలం 'వస్తు' విమర్శగా ఆగిపోలేదు. అవి తమదైన సౌందర్య శాస్త్రాలను నిర్మించుకుంటున్నాయి. ముస్లిం సాహిత్యంపై సంగిశెట్టి శ్రీనివాస్ పుస్తకం 'సవారు', కొలిమి పత్రికలో కాత్యాయనీ విద్మహే 'నీలి రాగం' వ్యాసాలు, దత్తయ్య అట్టెం పుస్తకం 'తెలంగాణ బి.సి. వాద సాహిత్యం', సూర్యా ధనంజయ్ పుస్తకం 'కాకోటి' వంటివి ఈ కోవలోనివే. అడ్లూరు రఘురామ రాజు "వాచకం, పఠనం, విమర్శ" అన్న కోణంలో వడ్డెర చండీదాస్ నవలలను చర్చించిన గ్రంథం 'వడ్డెర చండీదాస్: దర్శనమూ సాహిత్యమూ'. జి. అరుణ కుమారి ఫ్యూచరాలజీ కోణంలో రాసిన గ్రంథం 'తెలుగు కవిత్వం భవిష్యద్దర్శనం'. ఓల్గా మల్టీ డిసిప్లినరీ పెర్స్పెక్టివ్‌లో రాసిన గ్రంథం 'సంతులిత'. యస్. రఘు డిస్క్రిప్టివ్ క్రిటిసిజం కోణంలో రాసిన గ్రంథం 'సమన్వయ'... జిలుకర శ్రీనివాస్, పసునూరి రవీందర్ నవ్య దళితవాద విమర్శ వంటి కొత్త పద్ధతులను పరిచయం చేశారు. ఇవన్నీ 'కొత్త సిద్ధాంతాల' అన్వయాలు, నిర్మాణాలే. కాబట్టి, 'ఏమీ జరగడం లేదు' అనడం కళ్లముందున్న వాస్తవాన్ని కాదనడమే. విమర్శకుడు 'న్యాయమూర్తి' పాత్ర పోషించాలని మూల వ్యాసం ఆశిస్తున్నది. కానీ ఆధునిక విమర్శలో 'న్యాయమూర్తి' పాత్ర స్థానంలో 'విశ్లేషకుడు' లేదా 'వ్యాఖ్యాత' పాత్ర బలపడింది. ఇది పతనం కాదు, పరిణామం. గతంలో కట్టమంచి వంటి వారు 'కవిత్వం ఇలా ఉండాలి' అని తీర్పులు ఇచ్చారు. అది ఆ కాలపు చారిత్రక అవసరం. నేటి విమర్శ ఒక రచన 'ఎందుకు అలా ఉంది', 'దాని సామాజిక - చారిత్రక సందర్భం ఏమిటి,' 'దాని వెనుక భావజాలం ఏమిటి' అని విశ్లేషిస్తోంది. 'తీర్పు' ఇవ్వడం కంటే, 'పాఠకుడికి ఆ రచనను బహుళ కోణాల్లో అర్థం చేసుకునే పరికరాలను అందించడం' నేటి విమర్శ లక్ష్యం. నేటి విమర్శలో 'కేవలం విశ్లేషణ మాత్రమే చూస్తున్నాం' అని గోపాలయ్య నిరాశపడుతున్నారు. కానీ ఆ 'విశ్లేషణ'లోనే 'మూల్యాంకనం' అంతర్భాగం. 'వస్తువు, భాష, అభివ్యక్తి, శిల్పం' అనే నాలుగు మాటలతో రాస్తే విమర్శ కాదని గోపాలయ్య తీసిపారేయడం సరికాదు. ఏ కాలపు విమర్శ అయినా వీటి చుట్టూనే తిరుగుతుంది. సమస్య ఆ మాటల్లో లేదు, వాటిని విశ్లేషించే పద్ధతిలో ఉంది. ఉదాహరణకి గోపాలయ్య ప్రస్తావించిన వాటిలో మొదటిదైన 'వస్తువు'నే తీసుకుంటే... గతంలో వలె నేటి విమర్శ రచనలో 'వస్తువు ఏమిటి' అనేదానికే పరిమితం కాలేదు. 'ఆ వస్తువును ఎవరి దృక్కోణం నుంచి చూస్తున్నారు' అనేది నేటి విమర్శ ప్రధాన ప్రశ్న. ఉదాహరణకు, 'కుటుంబం' అనే ఒకే వస్తువును - మార్క్సిస్టు విమర్శ 'వర్గ' సంబంధాల కోణంలోనుబీ స్త్రీవాద విమర్శ 'లింగ' వివక్ష, 'పితృస్వామ్య' కోణంలోనుబీ మనోవైజ్ఞానిక విమర్శ 'అంతర్గత' సంఘర్షణల కోణంలోను విశ్లేషిస్తుంది. ఇక నేటి విమర్శ రచనలోని 'భాష' కేవలం 'సరళంగా ఉందా, సంక్లిష్టంగా ఉందా,' 'గ్రాంథికమా, వ్యావహారికమా' అని చూడటం లేదు. భాష వెనుక ఉన్న 'అధికార సంబంధాలను', 'ఆధిపత్య భావజాలాన్ని' శోధిస్తోంది. దీన్నే Discourse Analysis అంటారు. తెలంగాణ, రాయలసీమ ప్రాంతీయ అస్తిత్వవాద విమర్శ 'భాషపై, 'మాండలికాల రాజకీయం'పై చేసినంత లోతైన చర్చ గతంలో ఎన్నడూ లేదు. ప్రామాణిక భాష పేరుతో కొన్ని ప్రాంతాల, సమూహాల భాషను ఎలా అణచివేశారో విశ్లేషించడం నేటి విమర్శలో ముఖ్యమైన అంశం కాదా? ఇక 'అభివ్యక్తి', 'శిల్పం' విషయానికి వస్తే... ఆధునికోత్తరవాద పద్ధతులు వచ్చిన తర్వాత 'శిల్పం'పై విశ్లేషణ పూర్తిగా మారింది. గతంలా ఇది అలంకారాల లెక్క, ఛందస్సుల బేరీజు కాదు. కథన పద్ధతులు, మ్యాజిక్ రియలిజం, ఇంటర్-టెక్స్ట్యువాలిటీ వంటి కొత్త పరికరాలతో శిల్పాన్ని విశ్లేషిస్తున్నారు. పాఠకుడి పాత్ర కూడా శిల్ప విశ్లేషణలో భాగమైంది. మూల వ్యాసకర్త బహుశా పత్రికల్లో వచ్చే 'సమీక్ష'లను చూసి, దాన్నే సమగ్ర 'విమర్శ'గా భ్రమపడి ఉండవచ్చు.

# కోనసీమ సమగ్రాభివృద్ధికి సమిష్టి కృషి అవసరం : మంత్రి అచ్చెన్నాయుడు






**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంబేద్కర్ కోనసీమ జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామని వ్యవసాయ సహకార ఉద్యాన డైయిరీ డెవలప్మెంట్, మత్స్యశాఖ, జిల్లా ఇన్చార్జి మంత్రి కె అచెన్న నాయుడు అన్నారు. జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ అధ్యక్షతన శనివారం జిల్లా సమీక్ష కమిటీ సమావేశం అమలాపురం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఇటీవల సంభవించిన మొంథా తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టాలు, వ్యవసాయ, ఉద్యాన, పౌరసరఫరాలు మార్కెటింగ్, విద్యుత్ వివిధ రెవెన్యూ సమస్యలు, వైద్య వసతుల కల్పన, పశు సంవర్ధన పాడి పరిశ్రమల పనితీరుపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చం నాయుడు మాట్లాడుతూ జిల్లా సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సమర్ధవంతమైన ప్రణాళి కలతో ముందుకు వెళ్లాలన్నారు. మొంథా తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనడంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర నుండి క్షేత్రస్థాయి జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు భాగస్వామ్యంతో చేపట్టిన ముందస్తు హెచ్చరికలు, తీసుకున్న చర్యలు సఫలీకృతం కావడంతో నష్టాలను నివారించగలిగామన్నారు. అయినప్పటికీ దురదృష్టవశాత్తు ఒక మహిళ చెట్టు పడి చనిపోవడం దురదృష్టకరమన్నారు. తుఫాను ప్రభావిత మండలాలలో వంట గృహ ఆస్తి నష్టాలు అంచనా రూపకల్పన ప్రక్రియ ముగిసిందన్నారు. రైతుల సకాలంలో నష్ట పరిహారం ఇన్పుట్ సబ్సిడీ అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ ఉద్యాన అధికారులు ప్రజాప్రతినిధులు వివిధ పంటల పరిస్థితిపై వివరాలు అందించారు. బాధిత కుటుంబాలకు అందిన పునరావాస తాత్కాలిక సహాయక ఉపశమన చర్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేకూర్చాలని ఆదేశించారు. జిల్లాలో సమస్యగా ఉన్న డెల్టా ఆధునీకరణ డ్రైనేజీలలో పూడుకు తీత పనుల కొరకు 12 కోట్లు సర్వేకి ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనలు క్రోడీకరించి డెల్టా డ్రైనేజీ పూడికతీత ఆధునీకరణ వ్యవస్థకు అవసరమైతే బ్యాంకు రుణం ద్వారా చర్యలు చేపట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. తుఫాన్ ప్రభావంతో పునరావాస కేంద్రాలకు వచ్చిన ముంపు బాధితులకు పునరావాస ఉపశమన కార్యక్రమాల్లో భాగంగా 25 కేజీలు బియ్యం ఐదు రకాలు నిత్యవ సరాలతో పాటుగా 3 వేల రూపాయల తాత్కాలిక ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. తుఫాన్ హెచ్చరికలు మూలంగా చేపల వేట కోల్పోయిన మత్స్యకార, చేనేత రంగ కార్మిక కుటుంబాలకు 50 కేజీలు బియ్యం ఐదు రకాలు నిత్యవసర సరుకులు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. పంట నష్టపరిహారాలను హెక్టారుకు 17 వేల నుండి 25 వేలకు పెంచి అందిస్తున్నట్లు తెలిపారు.అరటి నష్టపరిహారంగా హెక్టారుకు 35000 ఇస్తున్న ట్లు వెల్లడించారు. జిల్లాలో 99.5 శాతం ఈ క్రాప్ నమోదు కావడం జరిగిందన్నారు. ఈ నెల 11 వరకు మిగిలిన శాతాన్ని పూర్తి చేసి నూటికి నూరు శాతం నమోదు చేయడం జరుగుతుందన్నారు. రీ సర్వే మూలంగా ఉత్పన్నమవుతున్న రెవెన్యూ సమస్యలు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మండలానికి మూడు రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి సమగ్రంగా సర్వే చేపడుతూ భవిష్యత్తులో రెవెన్యూ సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిర్దేశించిన టార్గెట్ 3 లక్షల 50 వేల మెట్రిక్ టన్నులుగా ఉందన్నారు. తుఫాన్‌కు ముందు జిల్లా వ్యాప్తంగా వరి పంట దిగుబడి 4 లక్షల 30 వేల మెట్రిక్ టన్నులు కాగా తుఫాన్ అనంతరం పంటలు దెబ్బతినడంతో దిగుబడి 3, 57,000 వేలుగా ఉందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఇచ్చిన టార్గెట్ దాదాపుగా సరిపోతుందన్నారు. రంగు మారిన ధాన్యాన్ని కూడా రైతులు వద్ద ఇబ్బందులు పెట్టకుండా సేకరించాలని మంత్రి సూచించారు. పలువురు ప్రజాప్రతినిధులు లేవనెత్తిన అంశాల పట్ల అధికారులు తక్షణమే స్పందించి ఆయా గ్యాప్‌లను పూరించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా నియోజకవర్గం విజన్ డాక్యుమెంట్ కార్యాలయంగా ప్రకటించిందని వాటి ద్వారా ప్రజలకు సుపరిపాలన అందించాలన్నారు. నిరుపయోగంగా ఉన్న హెల్త్ సెంటర్లలో తాత్కాలికంగా సిబ్బందిని నియమించి ఆరోగ్య సేవలు పునరుద్ధరించాలన్నారు. కార్మిక శాఖ మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారుల సమన్వయంతో తుఫాను సమర్థవంతంగా ఎదుర్కొనగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ కే మాధవి, శాసన మండల సభ్యులు పేరాబత్తుల రాజశేఖరం, తోట త్రిమూర్తులు, బొమ్మి ఇజ్రాయిల్, కె సూర్యనారాయణరావు, శాసనసభ్యులు ఏ ఆనందరావు, బండారు సత్యానందరావు వేగుళ్ళ జోగేశ్వరరావు, దేవ వర ప్రసాద్ గిడ్డి సత్యనారాయణ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేచే రూ. 5 లక్షలు బీమా చెక్కు అందజేత



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం నియోజకవర్గం ఇటీవల ప్రమాదవశాస్తూ మరణించినటువంటి తెదేపా కార్యకర్త కంది అప్పన అనే రమణ కుటుంబానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా ఐదు లక్షల రూపాయలు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త రమణ భార్య మంగ మాట్లాడుతూ తెదేపా సభ్యత్వం చేయించుకోవడం వల్ల తమ కుటుంబానికి న్యాయం జరిగిందన్నారు. సభ్యత్వం ద్వారా వచ్చిన ఐదు లక్షల రూపాయలతో ఎన్నో ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబం వాటి నుంచి బయటపడిందని భావోద్వేకానికి లోనైంది. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఎమ్మెల్యే చిన రాజప్పలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజా సూరిబాబు రాజు, తదితరులు పాల్గొన్నారు.

# గణిత అవధానికి చేయూత సంస్థ అవార్డు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రముఖ గణిత అవధాని, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామ కృష్ణను ప్రముఖ సేవాసంస్థ చేయూత ఉత్తమ సేవా పురస్కారం, ఆచార్య దేవో భవ అవార్డ్‌తో సత్కరించింది. కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో చేయూత సేవ సంస్థ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని పలు రంగాల్లో ఉత్తమ సేవలందిస్తున్న వారికి అవార్డులతో సత్కరించింది. ఈ మేరకు విద్యారంగంతో పాటు వివిధ సేవాసంస్థల్లో పాల్గొని తన వంతు సేవలను అందిస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయిరామ కృష్ణను కార్మిక శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరంల చేతుల మీదుగా దుశ్శాలువాతోను మెమెంటోతోను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేయూత రవి, అలీం, చింతా నారాయణ స్వామి, గిరజాల సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

# సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేస్తే చర్యలు : సిఐ వేమారెడ్డి, ఎస్.ఐ. రాజేష్

**సంగం, (రాజధాని వార్తలు):** వాహనదారుడు సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న జాతీయ రహదారి అత్యంత ప్రమాదాలు జరిగే రోడ్డుగా గుర్తించబడిన నేపథ్యంలో చెక్పోస్ట్ సెంటర్ వద్ద సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తూ..ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా ముద్రిం చిన పత్రాలను వాహనదారులకు అందజేశారు. పత్రాలలో ఉన్న రోడ్డు నియమ నిబంధనలను వారి చేతనే చదివించి సంతకాలు చేయించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు కేటాయించిన మార్గంలోనే, పూర్తిగా ఎడమ వైపు




వాహనాలు నడపాలని తెలిపారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదనీ పేర్కొన్నారు. ఈ నిబంధనలను పాటించని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ గీతంను విడుదల చేసిన ప్రొవిన్షియల్ సిస్టర్ డాక్టర్ నిర్మల



**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో ఎంతోమంది విద్యార్థులకు సేవా దృక్పథంతో తక్కువ ఫీజుతో ఆంగ్ల విద్యను అందిస్తున్న సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన స్కూల్ గీతం(పాట)ను మిషనరీ స్కూల్స్‌కు చెందిన ప్రోవీన్షియల్ సిస్టర్ డాక్టర్ నిర్మల విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "సర్వీస్ విత్ లవ్ మోటివ్" అనే పేరుతో ఈ గీతంను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. తమ పాఠశాలలో జరిగే వివిధ కర్యుక్కలమ్ ఆక్టివిటీస్‌ని ఈ గీతంలో పొందుపరచడం జరిగిందని తెలిపారు. విలువలతో కూడిన విద్య ను అందిస్తూ,క్రమశిక్షణ నేర్పుతూ భావి భారత సమాజాన్ని తీర్చిదిద్దే విద్యార్థులుగా మెరుగైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. చిన్నతనం నుంచే విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, పర్యావరణ పరిరక్షణ, సమాజంలో ఉత్తమ పౌరుడుగా ఎలా నడుచుకోవాలంటే అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ ప్రియ, సిస్టర్ సెబాస్టియన్, సిస్టర్ సోనియా, సిస్టర్ జెన్నీఫర్, ఉపాధ్యాయులు మునస్వామి, గంగాధర్, ఖలీల్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత గ్రామాల్లో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పర్యటన





**తిరుపతి, (రాజధాని వార్తలు):** సత్యవేడు నియోజకవర్గం ఓలూరు రాయల చెరువు తెగిపోవడంతో కలత్తూరు, కలత్తూరు హరిజనవాడ, పాతపాలెం గ్రామాలు తీవ్రంగా ప్రభావితమ య్యాయి. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. గ్రామస్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి కష్టనష్టాలను తెలుసుకు న్నారు. అక్కడి హృదయ విదారక దృశ్యాలని చూసి చలించిన ఎంపీ గ్రామస్థులకు ధైర్యం చెప్పారు. కష్ట సమయంలో అండగా ఉంటామని పునరావాసం కోసం తగిన ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఇప్పటికే ఎంపీ నిధుల నుంచి 20 లక్షల రూపాయలు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించిన ఎంపీ, అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వరద ప్రభావిత గ్రామాలలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూతూ మంత్రంగా పరిహారం ప్రకటించి తప్పించుకోవాలనే ప్రయత్నం చేస్తే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# 'గత వైభవం' ట్రైలర్.. నాలుగు యుగాల ప్రేమకథ




ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడని ఒక భారీ ఫాంటసీ ఎపిక్‌ను శాండిల్‌వుడ్ ఆడియన్స్‌కు అందించేలా ఉంది. దుష్యంత్, ఆషికా రంగనాథ్ జంటగా నటించిన 'గత వైభవం' ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ చూస్తుంటే, ఇది కేవలం ఒక పీరియడ్ డ్రామా కాదు, ఏకంగా నాలుగు వేర్వేరు యుగాల్లో సాగే ఒక ప్రేమకథ అని అర్థమవుతోంది. ఈ సినిమా ట్రైలర్ ఒక టైమ్ ట్రావెల్ తరహాలో ఉంది. పోర్చుగీస్ పాలన కాలం, ఆ తర్వాత దేవలోకం, ఒక చారిత్రాత్మక రాచరిక యుగం, చివరకు నేటి మోడ్రన్ కాలం.. ఇలా నాలుగు కాలాలను టచ్ చేస్తూ ఈ కథ సాగుతుంది. ఈ నాలుగు యుగాల్లోనూ హీరో, హీరోయిన్ల మధ్య ప్రేమ, వారిని వెంటాడుతున్న అడ్డంకులు వంటివి హైలెట్ అవుతున్నాయి. ఇక ఈ కాలంతో వారి ప్రేమ ఎలా సాగింది అనే అంశాన్ని తెరపై చూపించనున్నట్లు అర్థమవుతుంది. ఈ విజువల్ వండర్‌కు సుని దర్శకత్వం వహించారు. పురాణాలు, పీరియడ్ డ్రామా, ఫాంటసీ.. ఈ మూడు జానర్లను బ్యాలెన్స్ చేస్తూ ఆయన రాసుకున్న కథ చాలా డిఫరెంట్‌గా కనిపిస్తోంది. ముఖ్యంగా ప్రొడక్షన్ డిజైన్ కూడా బాగా హైలెట్ అయ్యింది. ప్రతి యుగానికి తగ్గట్టుగా సెట్టింగ్స్, కాస్ట్యూమ్స్‌లో చూపించిన డీటెయిలింగ్ ఆడియన్స్‌కు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తోంది. విలియం జె డేవిడ్ సినిమాటోగ్రఫీ, జుడా సంధ్య బ్యాక్‌గ్రౌండ్ స్కోర్.. ఆ ఎపిక్ ఫీల్‌ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లాయి. హీరో దుష్యంత్, హీరోయిన్ ఆషికా రంగనాథ్ నాలుగు యుగాలకు తగ్గట్టుగా వేర్వేరు గెటప్స్‌లో చాలా సహజంగా కనిపించారు. వారి మధ్య కెమిస్ట్రీ ఈ అద్భుత కథలో బలంగా ఉండనున్నట్లు అర్థమవుతుంది. ఇక ఈ సినిమాపై ఉన్న నమ్మకంతో, 'హనుమాన్' లాంటి బ్లాక్‌బస్టర్‌ను ప్రొడ్యూస్ చేసిన 'ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్' (నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి) రంగంలోకి దిగింది. తెలుగు రాష్ట్రాలు, నార్త్ అమెరికా, కెనడాలో ఈ సినిమాను వాళ్లే గ్రాండ్‌గా డిస్ట్రిబ్యూట్ చేస్తున్నారు. ఇక ఈ ఫాంటసీ లవ్ స్టోరీని ఈ నెల 14న ప్రపంచ వ్యాప్తంగా విడుదల చేయడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# సందీప్ తో విజయ్ కొడుకు 'సిగ్మా'.. ఏదో గట్టిగానే ప్లాన్ చేశారు



కోలీవుడ్ 'దళపతి' విజయ్ కొడుకు జేసన్ సంజయ్ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడన్న న్యూస్ వచ్చినప్పటి నుంచి కోలీవుడ్, టాలీవుడ్‌లో ఫుల్ బజ్ నడుస్తోంది. ఆ స్టార్ కిడ్ తన డెబ్యూ మూవీ కోసం ఎవరిని హీరోగా తీసుకుంటాడా అని ఫ్యాన్స్ ఈగర్‌గా వెయిట్ చేశారు. ఫైనల్‌గా, జేసన్ తన మొదటి సినిమా కోసం టాలెంటెడ్ యాక్టర్ సందీప్ కిషన్‌ను లాక్ చేసి సర్ ప్రైజ్ ఇచ్చాడు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ఏకంగా లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తుండటంతో, అంచనాలు డబుల్ అయ్యాయి. లేటెస్ట్‌గా, ఈ మల్టీ లింగ్వల్ యాక్షన్ అడ్వెంచర్‌కు పవర్‌ఫుల్ టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఆ టైటిలే.. 'సిగ్మా'. ఈరోజు రిలీజ్ చేసిన 'సిగ్మా' ఫస్ట్ లుక్ పోస్టర్ చూస్తేనే సినిమా వైబ్ ఏంటో క్లియర్‌గా అర్థమవుతోంది. డబ్బు కట్టలు, గోల్డ్ బార్లు, ఏనుగు దంతాలు.. ఇలా కోట్ల విలువైన నిధి కుప్పపై సందీప్ కిషన్ చాలా రఫ్ అండ్ రగ్గడ్ లుక్‌లో, ఫైట్‌కు రెడీ అన్నట్టు కూర్చున్నాడు. అతని బాడీ లాంగ్వేజ్, ఇంటెన్స్ లుక్ చూస్తుంటే ఇది పక్కా హై యాక్షన్ ఫీస్ట్ సినిమా అని అర్థమవుతుంది. ఇంత పెద్ద నిధి కోసం సందీప్ చేస్తున్న వేట ఎలా ఉంటుందనేది పోస్టర్‌తోనే ఆసక్తిని పెంచేశారు. 'సిగ్మా' అనే టైటిల్ పెట్టడానికి కూడా మేకర్స్ ఒక సాలిడ్ రీజన్ ఇచ్చారు. ఈ టైటిల్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఫుల్ ట్రెండింగ్‌లో ఉంది. "సిగ్మా" అంటే ఒక ఫియర్‌లెస్ తోడేలు. అంటే, ఎవరితో సంబంధం లేకుండా, ఒక అండర్‌డాగ్‌లా వచ్చి, తన ఓన్ రూల్స్‌తో, భారీ టార్గెట్లను రీచ్ అయ్యే క్యారెక్టర్ అన్నమాట. ఈ కాన్సెప్ట్ యూత్‌కు గట్టిగా కనెక్ట్ అయ్యేలా ఉంది. జేసన్ సంజయ్ మొదటి సినిమానే అయినా, టెక్నికల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ప్లాన్ చేశారు. ఈ యాక్షన్ అడ్వెంచర్‌కు మ్యూజిక్ డైరెక్టర్‌గా సెన్సేషనల్ కంపోజర్ థమన్‌ను తీసుకున్నారు. హెయిస్ట్ థ్రిల్లర్లకు థమన్ ఇచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఏ రేంజ్‌లో ఉంటుందో తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ నిర్మాణంలో వస్తున్న ఈ సినిమాను తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి భారీగా రిలీజ్ చేయనున్నారు.

సినిమా షూటింగ్ కూడా ఆల్మోస్ట్ ఫైనల్ స్టేజ్‌కు వచ్చేసింది. కేవలం 65 రోజుల్లోనే 95% షూటింగ్ కంప్లీట్ చేశారట. ఇక కేవలం ఒక్క సాంగ్ మాత్రమే బ్యాలెన్స్ ఉంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఫుల్ స్పీడ్‌లో జరుగుతున్నాయి. సందీప్ కిషన్ సరసన 'జాతిరత్నాలు' బ్యూటీ ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. వీరితో పాటు రాజు సుందరం, సంపత్ రాజ్ కీ రోల్స్ చేస్తున్నారు. అంతే కాదు, సినిమాలో చాలా ఎగ్జయిటింగ్ క్యామియోలు కూడా ఉన్నాయని చెప్పి, మేకర్స్ మరింత హైప్ క్రియేట్ చేశారు.

# ఒక్కప్పుడు లవర్.. ఇప్పుడు బాక్స్ ఆఫీస్ పోటీ.. నెగ్గేదెవరు?






సాధారణంగా హీరోల మధ్య బాక్సాఫీస్ వద్ద పోటీ ఉంటుందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు ఆ పోటీ ఒక హీరో, హీరోయిన్ మధ్య పోటీ నెలకొనడం కాస్త ఆసక్తికరంగా మారింది. ఒకప్పుడు ఇద్దరు ఒకే సినిమాలో ప్రేమికులుగా నటించి అందరినీ ఆకట్టుకున్నారు. అయితే ఆ ఇద్దరే ఇప్పుడు సక్సెస్ కోసం ఆరాటపడడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద పోటీకి దిగుతున్నారు. ఇద్దరు ఒకేరోజు విడుదలకు తమ సినిమాలను సిద్ధం చేస్తూ.. గట్టిగా పోటీ పడనున్నారు. మరి ఆ ఇద్దరు ఎవరు? వారు నటిస్తున్న చిత్రాలు ఏమిటి? ఏ చిత్రంపై ఎంత హైప్ ఉంది అనే విషయాలు ఇప్పుడు చూద్దాం. అసలు విషయంలోకి వెళ్తే.. 2016లో కిషోర్ తిరుమల దర్శకత్వంలో స్రవంతి రవి కిషోర్ నిర్మించిన చిత్రం 'నేను శైలజ'. ఇందులో రామ్ పోతినేని, కీర్తి సురేష్ జంటగా నటించారు. ఈ చిత్రం కీర్తి సురేష్‌కి తొలి తెలుగు చిత్రం కావడం గమనార్హం. ఇందులో ప్రేమికులుగా కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకున్నారు. అలాంటి ఈ ఇద్దరు ఇప్పుడు నవంబర్ 28న బాక్సాఫీస్ వద్ద పోటీ పడబోతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. గత కొంతకాలంగా రెడ్, ది వారియర్, డబుల్ ఇస్మార్ట్ అంటూ వరుసగా డిజాస్టర్‌లను చవి చూసిన రామ్ పోతినేని.. తాజాగా సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు. అందులో భాగంగానే ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి పి మహేష్ బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా నుండి మూడు పాటలు విడుదల చేయగా.. మూడు పాటలు కూడా సినిమాపై అంచనాలు పెంచేసాయి. ఈ సినిమా నవంబర్ 28న థియేటర్లలోకి రాబోతోంది. ఇదిలా ఉండగా మరొకవైపు మహానటి కీర్తి సురేష్ చివరిగా సుహాస్‌తో కలిసి 'ఉప్పుకప్పురంబు' అనే సినిమా చేసి ఈ చిత్రాన్ని నేరుగా ఓటీటీలో రిలీజ్ చేసింది. ఇప్పుడు లేడీ ఓరియంటెడ్ మూవీ 'రివాల్వర్ రీటా' తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఎప్పుడో విడుదల కావాల్సిన ఈ సినిమా పలు కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చి నవంబర్ 28న విడుదలకు సిద్ధమవుతోంది.

ఈ మేరకు చిత్ర బృందం అఫీషియల్ అనౌన్స్మెంట్ తో పాటు పోస్టర్ కూడా రిలీజ్ చేసింది. లేడీ డాన్ గెటప్‌లో కీర్తి సురేష్ నటిస్తుండగా.. జే.కే.చంద్రు దర్శకత్వం వహి స్తున్నారు. ఫ్యాషన్స్ స్టూడియోస్, ది రూట్ బ్యానర్స్ పై సుధన్ సుందరం, జగదీష్ పళనిస్వామి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. మరి భారీ అంచనాల మధ్య బాక్సాఫీస్ వద్ద పోటీ పడబోతున్న రామ్, కీర్తి సురేష్.. ఇద్దరిలో ఎవరు బాక్సాఫీస్ వద్ద నెగ్గుతారో చూడాలి.

# చిరు గ్రేసు.. చరణ్ మాసు..మెగా ఫ్యాన్స్‌కి ఇంకేం కావాలి..!







టాలీవుడ్ లో నెంబర్ 1 డాన్సర్ అంటే చిరంజీవి తర్వాతే ఎవరైనా అనేస్తారు. ఇప్పుడు ఎన్టీఆర్, చరణ్, అల్లు అర్జున్ అని అంటున్నారు కానీ ఒకప్పుడు బ్రేక్ డాన్స్ అంటే చిరంజీవే.. సాధారణంగా ఏ హీరో సినిమా అయినా సాంగ్ వచ్చింది అంటే థియేటర్ నుంచి అలా బయటకు వెళ్లి దమ్ము కొట్టి వస్తారు. కానీ ఆ దమ్ము ఇచ్చే కిక్కు కన్నా చిరు చేసే స్టెప్పులే మెగా ఫ్యాన్స్‌కి ఎక్కువ కిక్ ఇస్తాయి. అందుకే చిరంజీవి సినిమాల్లో సాంగ్స్ మాక్సిమం సూపర్ హిట్ అవుతాయి. ఇక ఆయన గ్రేస్‌తో వేసే స్టెప్పులు మెగా ఫ్యాన్స్‌ని మాత్రమే కాదు ఆబాల గోపాలాన్ని అలరిస్తాయి. ప్రస్తుతం 70 ఇయర్స్ ఏజ్ లో కూడా ఆ గ్రేస్‌లో ఎక్కడ తగ్గకుండా డాన్స్ చేస్తున్నారు చిరంజీవి. రీసెంట్‌గా ఆయన నటిస్తున్న మన శంకర వరప్రసాద్ సినిమాలో మీసాల పిల్ల సాంగ్ రిలీజైంది. ఈ సాంగ్‌లో చిరు గ్రేసీ స్టెప్పులు అదిరిపోయాయి. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కుతున్న మన శంకర వరప్రసాద్ సినిమాలోని మీసాల పిల్ల సాంగ్ సూపర్ హిట్ అయ్యింది. సాంగ్‌లో చిరు కూల్ స్టెప్స్ ఫ్యాన్స్‌ని విశేషంగా ఆకట్టుకున్నాయి. సంక్రాంతికి రిలీజ్ కాబోతున్న ఎం.సి.జి సినిమా ఈ సాంగ్‌తోనే ఒక క్రేజీ వైబ్ తీసుకొచ్చారు. భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. చిరంజీవి సినిమాకు కంపోజ్ చేయడం లక్కీగా ఫీల్ అవుతున్నాడు భీమ్స్. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా సరే ఈ పాట వినిపిస్తుంది. ఇక దీనితో పాటు గ్లోబల్ స్టార్ రాం చరణ్ బుచ్చి బాబు కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది సినిమా నుంచి ఫస్ట్ సాంగ్‌గా చికిరి రిలీజైంది. అకడమీ విన్నర్ ఏ.ఆర్ రెహమాన్ ఈ సినిమాకు మ్యూజిక్ అందిస్తున్నారు. చిత్ర యూనిట్ డైరెక్ట్‌గా వీడియో సాంగ్‌నే రిలీజ్ చేసి సర్‌ప్రైజ్ చేశారు. చరణ్ మాస్ స్టెప్పులు, జాన్వీ కపూర్ అందాలు అబ్బో చికిరి సాంగ్‌కి స్పెషల్ ఎట్రాక్షన్‌గా నిలిచాయి. ముఖ్యంగా చరణ్ హుక్ స్టెప్ అయితే ఇప్పటికే సోషల్ మీడియాలో రీల్స్ చేయడం మొదలు పెట్టారు. ఇటు చరణ్ చికిరి సాంగ్.. అటు చిరు మీసాల పిల్ల సాంగ్.. రెండు సినిమాల నుంచి రిలీజైన మొదటి సాంగ్స్ రెండు సూపర్ హిట్ అయ్యాయి. చిరు పాటని ఫ్యామిలీస్ కూడా ఎంజాయ్ చేస్తుంటే.. చరణ్ చికిరి సాంగ్‌ని యూత్ ఆడియన్స్ అంతా సోషల్ మీడియాలో హడావిడి చేస్తున్నారు. ఈ రెండు సినిమాల మధ్య రిలీజ్ రెండు నెలలు గ్యాప్ ఉంది. అయినా సరే మెగా ఫాదర్ అండ్ సన్ సాంగ్స్‌తో మెగా ఫ్యాన్స్‌కి ఒక ప్రత్యేకమైన జోష్ తెచ్చారు.

మెగాస్టార్ చిరంజీవి మన శంకర వరప్రసాద్ సినిమా అనిల్ మార్క్ కామెడీతో పాటు చిరు కోసం మెగా ఫ్యాన్స్ కోరుకునే అన్ని అంశాలు ఉండేలా చూసుకుంటున్నాడట. ఇక చరణ్ పెద్ది మాత్రం కథ, కథనంతో పాటు చరణ్ స్క్రీన్ ప్రెజెన్స్, పర్ఫార్మెన్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటాయని అంటున్నారు. ఈమధ్య స్టార్ సినిమాలు ఐనా కూడా సరైన పబ్లిసిటీ లేకపోతే షాకింగ్ రిజల్ట్స్ అందుకుంటున్నాయి. మన శంకర వరప్రసాద్‌ని ఎలా జనాల్లోకి తీసుకెళ్లాలో అనిల్ రావిపూడి పర్ఫెక్ట్ ప్లానింగ్‌తో వస్తున్నాడు. ఇక చరణ్ పెద్ది కోసం బుచ్చి బాబు కూడా ప్రమోషనల్ ప్లాన్ కోసం గట్టి స్కెచ్ వేస్తున్నారట. రెండు సినిమాల మీద మెగా ఫ్యాన్స్ చాలా హోప్స్ పెట్టుకున్నారు. ఎలాగు రిలీజ్‌కు రెండు నెలలు గ్యాప్ ఉంది కాబట్టి ఈ రెండు సినిమాలకు మెగా ఫ్యాన్స్ ఆదరించే ఛాన్స్ ఉంది.

# సీతం కళాశాలలో ప్రారంభమైన క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోగశాల





**విజయనగరం, (రాజధాని వార్తలు):** క్వాంటమ్ కంప్యూటింగ్ నేటి రోజులలో ఆధునాతనమైన పరిభాష సీతం కళాశాలలో విద్యార్థుల కు ఈ సరికొత్త రంగంలో ప్రవేశం కల్పించడానికిగాను క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోగశాల ఏర్పాటు చేయడమైనది. "కొత్త పోకడ లను పుణికి పుచ్చుకోవడంలోనూ, విద్యార్థులకు అవగాహనావకా శాలూ పరిశోధనావకాశాలూ కల్పించడంలో సీతం కళాశాల ఎప్పుడూ ముందంజలో వస్తూనే ఉంటుందని" కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి అన్నారు. ఈ సందర్భంగా సభనుద్దేశించి ప్రసంగిస్తూ "కేవలం పాఠ్య పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా నైపుణ్యమూ, సృజనాత్మకతా పెంపొందించే దిశలో విద్యార్థులను నడిపించడమే సీతం ధ్యేయ మని" కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణ రావు తెలిపారు. విద్యార్థులు ఈ ప్రయోగశాలను సద్వినియోగం చేసుకుని అద్భుత విజయాలను కైవశం చేసుకోవాలని కళాశాల ప్రధానాచార్యుడు డాక్టర్ ద్వివేదుల వేంకట రామమూర్తి విద్యార్థులకు పిలుపుని చ్చారు. ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేయడానికి కీలక కృషి చేసిన, డీన్ రీసెర్చ్ మరియు డెవలప్‌మెంట్ డాక్టర్ జాన ప్రసూన తన హర్షం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా జరిగిన పూజా ఆరంభం కార్యక్రమాలలో సీతం విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# స్మార్ట్ కిచెన్ల పేరుతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేయొద్దు



**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ మండల కేంద్రంలో మధ్యాహ్న భోజన కార్మిక సంఘ కార్మికులు సమావేశం జరిగింది. వారి సమస్యలపై నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. కార్యక్ర మాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి మరియు భోజన నిర్వహణ సంఘం జిల్లా కార్యదర్శి ఎన్వై నాయుడు వి రామలక్ష్మి శాంతకుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గత 22 సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని అందులో భాగంగా ప్రతి మండలంలో గల పాఠశాలలు హై స్కూల్స్ ప్రస్తుతం నిర్వహిస్తున్న వంట విధానాన్ని నిలిపివేసి ఒకచోట స్మార్ట్ కిచెన్ పేరుతో సామూహిక వంటశాలలో నిర్వహిం చేందుకు విద్యాశాఖ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని. గతంలో ఎన్నో వ్యయ ప్రయాసులకు లోబడి సేవా దృక్పథంతో తాము ఈ పథకా న్ని నిర్వహిస్తున్నామని కానీ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథక నిర్వాహకుల ఉపాధిని తీసివేసేందుకు అలాగే ప్రైవేట్ కాంట్రాక్టర్లకు మేలు చేకూరేలా కమిషన్ల కోసం ప్రభుత్వ పెద్దలు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆయన అన్నారు. ఇకనైనా ప్రభుత్వం తమ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకుల సంఘం నాయకులు జ్యోతి, పార్వతి, రమణమ్మ సిఐటియు మండల నాయకులు జి కృష్ణారావు ఆదివాసి గిరిజన కార్యదర్శి తాడంగి ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# క్రాప శంకరా గూడెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

**అయినవిల్లి, (రాజధాని వార్తలు):** అయినవిల్లి మండలం క్రాపశంక రాయ గూడెంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అయినవిల్లి మండల వైస్సార్సీపీ అధ్యక్షులు మేడిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రచ్చబండ కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పి. గన్నవరం నియోజకవర్గం కోఆర్డినేటర్ గన్నవరరపు శ్రీనివాస రావు, పరిశీలకులు చింతలపాటి శ్రీనివాస్ రాజు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పార్టీ జాయింట్ సెక్రెటరీ వాసంశెట్టి తాతాజీ,రాష్ట్ర బూత్ వింగ్ కమిటీ సెక్రెటరీ చేట్ల రామారావు యువజన విభాగం రాష్ట్ర సెక్రెటరీ గుత్తుల నాగబాబు, జిల్లా ఉపాధ్యక్షులు కుడిపూడి



విద్యాసాగర్, కుడిపూడి రామకృష్ణ, పినిపే బుజ్జి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి

## - ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే, డిసిసిబి ఛైర్మన్లు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న చిన్న దేవాలయాలను అభివృద్ధి పరచడంలో ధర్మకర్తల మండ లులు కృషి చేయాలని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరా జప్ప, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు)లు అన్నారు. పెద్దాపురం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివా రం ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కే జగదీశ్వరరావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పడిన ధర్మకర్తల మండలి ఛైర్మన్ జల్లూరి వీర్రాజు, మండల సభ్యులు పాసిల వెంకటరమణ రావు, ఎర్రమిల్లి సత్య వెంకటరమణ, తమ్మన రమాదేవి, మట్టే ప్రదీప్, పసుపులేటి సత్యవేణి, లంక వరలక్ష్మి, పూసపాటి శ్రీనివాసరావులతో పాటు ఎక్స్ అఫీషి యో సభ్యులుగా ఆలయ అర్చకులు పెద్దింటి రమేష్ లచే ఆలయ అధికారి జగదీ శ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసి పాల్గొన్న ఎమ్మెల్యే చినరాజప్ప, బాబులు మాట్లాడుతూ చిన్న దేవాలయాలకు ఆదాయం అంతం తమాత్రంగా ఉంటుందన్నారు. దానితో ఆలయాల అభివృద్ధికి దాతల సహకారం ఎంతైనా అవసరం అన్నారు. ఆ విధంగా దాతలను తీసుకురావడం ద్వారా ఆలయ అభివృద్ధికి ధర్మ కర్తలు మండలి కృషి చేయాలని వారు పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే, డిసిసిబి ఛైర్మన్లు వెంకటేశ్వర స్వాములు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. అలాగే నూతన ధర్మ కర్తల మండలికి వారు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఇంకా కూటమి నాయకులు రాజా సూరిబాబు రాజు, నూనె రామారావు, సత్తిబాబు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

# విద్య, వైద్యం ప్రజల కనీస హక్కు

**- ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని ప్రజలకు దూరం చేస్తోంది - మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నాం - వైయస్సార్సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షులు చిన్న శ్రీను**






**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా పార్టీ అధ్యక్షులు, జడ్పీ ఛైర్మన్, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) విజయనగరం ధరంపురి తన క్యాంప్ కార్యాలయం అందు విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్న శ్రీను మాట్లాడుతూ..విద్య, వైద్యం ప్రజల కనీస హక్కు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వీటిని ప్రజలకు దూరం చేస్తోంది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 12వ తేదీన పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీలు నిర్వహి స్తున్నాం. దీనికి సంబంధించి కోటి సంతకాల సేకరణ ఇప్పటికే మొదలయ్యింది, ప్రజలలో భారీ స్పందన వచ్చింది. అమరావతి నిర్మాణానికి ఒకవైపున వేల కోట్లు అప్పులు తెస్తున్నారు, మరొక వైపు గత 17 నెలల్లో 2 లక్షల కోట్లకు పైగా అప్పులు చేశారు, కానీ ఒక మెడికల్ కాలేజీకి 500 కోట్లు ఈ ప్రభుత్వం ఎందుకు కేటాయించలేకపోతోంది ఆరోగ్యశ్రీని ఆపేశారు, దీంతో పేదలు నానా అవస్థలు పడుతున్నారు, డయాలసిస్ పేషెంట్లకు దిక్కు లేకుండా పోయింది. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రతి సారి భోగాపురం ఎయిర్పోర్ట్ వద్దకు వెళ్లి ఫోటోలు దిగి, 91 శాతం పనులు పూర్తి అయ్యాయని అసత్యాలు చెబుతున్నారు. మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో ఈ ఎయిర్పోర్టుకు సంబంధించి 2,203 ఎకరాల భూ సేకరణ చేసాం. 527 నిర్వాసిత కుటుం బాలకు పరిహారాన్ని అందించాం, మా హాయంలో 23% పనులు



పూర్తి చేశాం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ ఎయిర్పోర్టుకు సంబంధించి కొత్తగా ఏమైనా అనుమతులు గాని, నిర్మాణాలు గానీ చేపట్టిందా? గత మా వైఎస్ఆర్సిపి ప్రభుత్వంలో అమలైన పథకాలకు పేర్లు మార్చడం, మా హాయంలో చేసిన పనులను టిడిపి నేతలు తమ ఖాతాలో వేసుకోవడం తప్ప ఈ 17 నెలల్లో వీరు చేసింది కొత్తగా ఏమైనా ఉందా? ఇటీవల సంభవించిన తుఫాన్ ధాటికి జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, వాటికి సంబంధించి పంట నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించాలి. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి, గోనె సంచులను ప్రభుత్వమే రైతులకు అందించాలని కోరుతున్నాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శులు నేక్కల నాయుడు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇప్పలి అనంత్, నరసింహ మూర్తి, గొర్ల రవి, వేణు, వైస్సార్సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

# గర్ల్స్ హై స్కూల్ విద్యార్థిని ప్రతిభ – జిల్లా స్థాయిలో తృతీయ స్థానం

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** జిల్లాస్థాయి నైపుణ్య పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన ఉ త్తమ ప్రదర్శన ద్వారా ప్రతిభ కనబరిచింది. కీర్తన తయారుచేసిన ఎగ్జిబిట్‌కి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం దక్కింది. శుక్రవారం విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థినీలు తాము సొంతం గా తయారు చేసిన నైపుణ్యాల ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. వీటిని జిల్లా కమిటీ పరిశీలించి ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలకు ఎంపికలు చేసింది. ఈ మేరకు కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి ఏ.రామారావు తృతీయ స్థానంలో నిలిచిన గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని కీర్తనకు ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందజేసినట్లు వ్యవసాయ శాస్త్ర ఉపాధ్యాయురాలు బి.ఝాన్సీ తెలిపారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి. హెచ్.



రమేష్ కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థిని కీర్తనను, ఉపాధ్యాయురాలు బి.ఝాన్సీని అభినందించారు.

# విజయనగరం విజ్జి స్టేడియంలో రాష్ట్ర స్థాయి కోకో పోటీలను ప్రారంభించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్





**విజయనగరం, (రాజధాని వార్తలు):** నాకు వ్యక్తిగతంగా క్రీడలు అంటే ఎంతో ఇష్టం. క్రీడల పట్ల మమకారం ఉండాలి, తల్లిదం డ్రులు తమ పిల్లలకు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ప్రోత్సహించాలి. క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందించే విధంగా సహకరిస్తాయి. గెలుపు, ఓటములను ఒకే విధంగా చూడాలి, విజయాన్ని చూసి పొంగిపోకూడదు, ఓటమిని చూసి బాధ పడకూడదు. విజయం బాధ్యత పెంచు తుంది, ఓటమి గుణపాఠాలను నేర్పుతుంది, ఎలా ముందుకు వెళ్లాలో క్రీడల్లో నేర్చుకోవాలి. వ్యక్తిగత క్రమశిక్షణకు క్రీడలు ఎంతగానో దోహదపడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అయినా ప్రస్తుత రాష్ట్రంలో అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్రీడాకారులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు. ఉమెన్ క్రికెటర్ శ్రీ చరణీ రెడ్డి విషయంలో మనం అందరం చూసాం, ఆమెకు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగం, 2.5 కోట్ల రూపాయల నగదు బహు మతిని ముఖ్యమంత్రి ఇవ్వడం జరిగింది అలాగే 1000 గజాల స్థలం కూడా మంజూరు చేశారు. క్రీడాకారులు దేశానికి ఆస్థి, దేశ గౌరవాన్ని పెంచడంలో మీ పాత్ర ఎంతో కీలకం. క్రీడల్లో



అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి, విజయాలు సాధించిన క్రీడాకారు లకు ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించడం జరుగుతుంది. ఆర్మీ, పోలీస్ సహా ఎన్నో రంగాల్లో క్రీడాకారులు కీలక స్థానాల్లో ఉ న్నారు. ఆపరేషన్ సింధూర్‌లో మహిళల పాత్ర కీలకం, క్రీడల్లో అమ్మాయిలను ప్రోత్సహించాలి. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు కూటమి నాయకులు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# "శివుడికే శఠగోపం పెట్టిన సోమిరెడ్డి"




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. శివుడికి అత్యంత ప్రీతిప్రాయమైన ఈ కార్తీకమాసంలో భక్తులందరూ శివాలయాలలో శివుడ్ని ఆరాధిస్తారు. సర్వేపల్లి శాసనసభ్యుడు సోమిరెడ్డి కూడా శివాలయాలకు వెళుతూ కార్తిక దీపాలు వెలిగిస్తూ, పాలాభిషేకాలు చేస్తున్నాడు. శివుడి సొత్తు కాజేస్తూ, క్షమాపణ కోరేందుకే, సోమిరెడ్డి శివాలయం చుట్టూ తిరుగుతున్నాడని ప్రజలు భావిస్తున్నారు. పరమశివుడికి అభిషేకం చేస్తున్న సోమిరెడ్డి శివుడికి శఠగోపం పెడుతున్నాడు. సర్వేనెంబర్ 63-A1 లోని 0.48 సెంట్ల భూమిని డాక్యుమెంట్ నెంబర్ 23/1980 ప్రకారం ఆలూరు హరి ప్రసాద్ రెడ్డి అనే భక్తుడు కాకుటూరులోని శ్రీ రాజా రాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి అన్ని హక్కులు వర్తింపజేస్తూ, రాసి ఇచ్చి దేవాలయం పేరిట రిజిస్టర్ చేశాడు. ఆలూరు హరిప్రసాద్ రెడ్డి అనే భక్తుడు శివాలయానికి ఇచ్చిన 0.48 సెంట్లు భూమికి సంబంధించి, అడంగల్, భూమి పత్రాల ఆధారంగా ఆ భూమి శివాలయం ఆధీనంలో ఉంది. సోమిరెడ్డి కోటి రూపాయలు పుచ్చుకొని, శివాలయానికి చెందిన 0.48 సెంట్ల భూమిలో రియల్ ఎస్టేట్ యజమానుల కోసం సిమెంటు రోడ్డు నిర్మించాడు. శివుడు యజమానిగా ఉన్న భూమిలో అధికారుల సైతం ఇచ్చిన స్కెచ్‌లో కూడా, దేవుని భూమి ఆక్రమించుకొని రోడ్డు నిర్మించినట్లు చూపించారు. ఆలూరు హరి ప్రసాద్ రెడ్డి అనే భక్తులు దేవుడు ఇచ్చిన భూమి దేవుడి ఆధీనంలో ఉందా! లేక పరాధీనంలో ఉందా! అనే భక్తుల ప్రశ్నకు సమాధానం లేదు. సర్వేపల్లి నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులు దేవుడు భూమిని కాజేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. సర్వేపల్లి నియోజకవర్గంలో మట్టి, ఇసుక, గ్రావెల్, బూడిద సోమిరెడ్డి దోచుకుంటున్నాడు. సర్వేపల్లిలో బంకర్ల వాహనాల నుండి అక్రమ వసూలు చేస్తూ పామాయిల్ ట్యాంకర్లను దారిదోపిడి చేస్తున్నారు. ప్రశ్నిస్తే దాడులు చేయడం, గొంతులు కోయడం, హత్యలు చేయడానికి కూడా వెనుకాడడం లేదు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి శాసనసభ్యుడుగా ఎప్పుడు లేని విధంగా దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయి. దేవుడి భూములకు సైతం సర్వేపల్లిలో రక్షణ లేకుండా పోయింది. చంద్రబాబు లోకేష్ కాకుటూరు శివాలయం భూమి ఆక్రమణపై విచారణ జరిపించి, దేవదాయ భూములను కాపాడాలని డిమాండ్ చేస్తున్నాం. వెంకటాచలం గ్రామపంచాయతీ కనుపూరు బిట్-1 కు సంబంధించి,0. 20 సెంట్ల కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు సోమిరెడ్డి స్కెచ్ వేశాడు. - 952/1-B సర్వే నంబర్ భూమిని ప్రభుత్వం అధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను సైతం జిల్లా అధికారులు బేఖాతరు చేశారు. పంచాయతీ తీర్మానంతో, సోమిరెడ్డి కోట్ల విలువైన 0.20 సెంట్ల భూమిని కాజేసేందుకు కుట్ర పన్నాడు. వెంకటాచలం పంచాయతీ గ్రామ సర్పంచ్ మందల రాజేశ్వరమ్మ తీర్మానాన్ని తిరస్కరించడంతో, ఆమెను తొలగించి, స్పెషల్ అధికారి ద్వారా భూమిని కొట్టేయాలని సోమిరెడ్డి ప్రయత్నిస్తున్నాడు. రైతుల భూములను రియల్ ఎస్టేట్ కోసం చౌకగా కొట్టేయడానికి రైతులను బెదిరిస్తున్నారు. భూములను అమ్మనన్న పిడతాపోలూరు రైతులపై కక్షపూరితంగా సాగునీరు ఆపుతానంటూ, రైతులను ఇబ్బందులు పెడుతున్న పరిస్థితి. సర్వేపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ, దేవాలయ భూములతో పాటు, రైతుల భూములకు కూడా రక్షణ లేకుండా పోయింది. గతంలో సోమిరెడ్డి మంత్రిగా కృష్ణపట్నం సిద్దేశ్వరాలయానికి సంబంధించిన 5 కోట్ల రూపాయల నిధులను ఇతర జిల్లాలోని దేవాలయాలకు మళ్ళించాడు. సిద్దేశ్వరాలయ అభివృద్ధి కోసం ఉపయోగించాల్సిన దేవాలయ నిధులను వేరే జిల్లా దేవాలయాలకు సోమిరెడ్డి ఇచ్చాడు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జగన్మోహన్ రెడ్డి చొరవతో, సోమిరెడ్డి ఇచ్చిన సిద్దేశ్వరాలయానికి చెందిన 2.5 కోట్ల రూపాయలను వడ్డీతో సహా వెనుకకు తెప్పించాం. జగన్మోహన్ రెడ్డికి దేవుని పట్ల భక్తుల మనోభావాల పట్ల ఉన్న గౌరవం నిబద్ధతకు ఇదొక ఉదాహరణ. దేవుడి భూములను కాజేసే వారిని రక్షించడమే సనాతన ధర్మమా! పవన్ కళ్యాణ్ సమాధానం చెప్పాలి. కూటమి పార్టీలోని ఎమ్మెల్యేలు దేవాలయ భూములు కాజేస్తుంటే వారిని కాపాడుడుతారా! లేదా వారిపై చర్యలు తీసుకుంటారో పవన్ కళ్యాణ్ స్పందించాలి. దేవదాయ శాఖ మంత్రి ఉన్న జిల్లాలోనే దేవుని భూములకు రక్షణ లేకుండా పోయింది. దేవుని భూములను కాపాడాలని దేవదాయ శాఖ మంత్రికి, అధికారులకు, జిల్లా రెవిన్యూ అధికారులను కోరుతున్నాం. అధికారులు వెంటనే చొరవ తీసుకొని దేవాలయ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడి, భక్తుల మనోభావాలను కాపాడాలి. చంద్రబాబు దేవుని అడ్డుపెట్టుకొని రాజకీయాలు చేయడాన్ని ప్రక్కన పెట్టి, దేవదాయ భూముల అన్యాక్రాంతంపై విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు చేపట్టి, దేవాలయ భూములను కాపాడాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. చంద్రబాబు ప్రభుత్వం స్పందించకపోతే, భక్తులతో కలిసి ఛలో కాకుటూరు కార్యక్రమాన్ని చేపట్టి, తిరిగి దేవాలయ భూములను దేవాలయానికి అప్పజెప్పే బాధ్యత తీసుకుంటామని తెలియజేస్తున్నాం.

# కోవూరు నియోజక వర్గాన్ని వరద ముప్పు నుంచి కాపాడండి

**- కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లు మరమత్తులు, పెన్నా డెల్టా పరిధిలోని సాగునీటి కాలువలో పూడికతీత పనులకు నిధులు కేటాయించండి - సాగునీటి రంగంలో కీలక పాత్ర పోషించే లష్కర్లకు జీతాలు చెల్లించండి - రహదారులు రక్తమోడుతున్నాయి, రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టండి - సాంకేతిక సమస్యల కారణంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు అందడంలో జరుగుతున్న జాప్యాన్ని నివారించండి - సమీక్షలతో జాప్యం చేయకుండా పేదల ఇళ్ళు, ఇంటి స్థలాల సమస్యకు పరిష్కారం చూపండి - డెల్టా ప్రాంత వరి కోతల సీజన్ ను దృష్టిలో వుంచుకొని ధాన్య సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయండి - గతంలోలా 75 శాతం సబ్సిడీతో మత్స్యకారులకు బోట్లు, వలలు ఇవ్వండి - ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హిమాన్షు శుక్లా హామీ - జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి**





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** పెన్నా డెల్టా ఆధునీరణకు నిధులు కేటా యించి రైతులను ఆదుకోవాలని కోరారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి. నెల్లూరు నగరంలోని జెడ్పి సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ పెన్నా నది పరివాహక ప్రాంతమైన కోవూరు నియోజకవర్గ భౌగోళిక పరిస్థితులు, 2021 లో వచ్చిన వరదలను దృష్టిలో వుంచుకొని పెన్నానది పొర్లుకట్టలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ఆమె మంత్రులు మరియు జిల్లా కలక్టర్ దృష్టికి తెచ్చారు. కనిగిరి రిజర్వాయర్ క్రస్ట్ గేట్లు మరమత్తులు చేయడంతో పాటు ప్రస్తుత రబీ సీజన్లో పెన్నా డెల్టా పరిధిలోని సాగునీటి కాలువలో పూడికతీత పనులకు నిధులు కేటాయించాలని కోరారు. పెన్నా నదికి వచ్చే వరదల సందర్భంగా కోతకు గురయ్యే ప్రాంతాలలో రిటైనింగ్ వాల్స్ కట్టి పరిహాక ప్రాంత ప్రజలను వరద ముప్పు నుంచి కాపాడవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. ఆయకట్టు పరిధిలోని చివరి ఎకరాకు నీళ్లు అందించడంలో సాగునీటి రంగంలో కీలక పాత్ర పోషించే లష్కర్ల జీతాలు వెంటనే చెల్లించాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు కోరారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో బోర్ల పై ఆధారపడి వ్యవసాయం చేసుకునే రైతుల కోసం నెల్లూరులోని పెన్నా బ్యారేజ్ ద్వారా దిగువకు నీరు విడుదల చేసి తీర ప్రాంత గ్రామాలలో భూగర్భ జలాల పెంపుకు కృషి చేసి వేసవిలో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో కొడవలూరు మండలం టపాతోపు, చంద్రశేఖరపురం జంక్షన్, గండవరం బ్రిడ్జ్, కోవూరు మండలం రామన్నపాలెం, ఇనుమడుగు శివాలయం తదితర ప్రాంతాలలో నిత్యం జరిగే రోడ్డు ప్రమాదాలను అరికట్టే దిశగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. పేదలకు ఇళ్ళు, ఇంటి స్థలాల కేటాయింపులో జరుగుతున్న జాప్యాన్ని నియంత్రించాలని ఆమె మంత్రుల దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వం వేసిన లేఅవుట్లలో కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్న విషయాన్ని ఆమె సమీక్షా సమావేశంలో ప్రస్తావించారు. కోవూరు నియోజకవర్గంలో 10 మందికి ఇళ్ళు అవసరముందని, సమీక్షల పేరుతొ జాప్యం చేయకుండా పేదలకు ఇళ్ళు, ఇంటి స్థలాల మంజూరు చేసేలా హౌసింగ్ అధికారులు కృషి చేయాలనన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేర్చడంలో సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారుతున్నాయన్నారు "అన్నదాత సుఖీభవ", "మత్స్యకార సేవలో" లాంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు బ్యాంక్ లింకేజి, ఆధార్ కార్డులలో పొరపాట్లు తదితర కారణాలతో అర్హులైన లబ్దిదారులకు అందడంలో జరుగుతున్న జాప్యాన్ని అరికట్టాలని ఆమె జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా దృష్టికి తెచ్చారు. చిన్న, సన్నకారు రైతుల అవసరాలను దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం యిస్తున్న యూరియా కార్డులు నాన్ డెల్టా, మరియు చెరువు భూముల్లో సాగుచేస్తున్న రైతులకు కూడా అందచేసేలా చర్యలో తీసుకోవాలని అధికారులను కోరారు. పెన్నా డెల్టా పరిధిలో రెండవ పంట ధాన్య సేకరణలో జరిగిన జాప్యం కారణంగా అన్నదాతలు నష్టపోయారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

**జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హామీ**

డెల్టా ప్రాంత వరి కోతల సీజన్‌ను దృష్టిలో వుంచుకొని ముందుగానే ధాన్య సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మంత్రులు మరియు కలెక్టర్‌ల దృష్టికి తెచ్చారు. మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న బోట్లు, వలలను ప్రస్తుత 40 శాతం సబ్సిడీ కాకుండా 2014-19 మధ్య కాలంలో అమలులో వున్న 75 శాతం సబ్సిడీ వర్తించేలా కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి లేవనెత్తిన రైతాంగ సమస్యలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలులో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తానని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా హామీ యిచ్చారు. క్షేత్ర స్థాయిలో అధికారులు మరియు బ్యాంకర్లను అప్రమత్తం చేసి భవిషత్తులో అర్హులైన లబ్దిదారులకు ప్రభుత్వ పథకాలు చేర్చడంలో ఏటివంటి అవాంతరాలు రాకుండా చూస్తానన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధ్యక్షతన నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎన్ఎండి ఫరూఖ్, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బీద మస్తాన్ రావు, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, తూమాటి మాధవరావు, శాసన సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కాకర్ల సురేష్, కృష్ణా రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావులతో పాటు వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కార్తీక మాస వైభవం.. ఉప్పొంగిన భక్తిభావం

**- మూడో రోజు కార్తీక మాస లక్ష దీపోత్సవానికి తరలివచ్చిన భక్తులు - దివ్యమైన దీపాల వెలుగుల్లో మెరిసిన మైదానం - కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యేలు ఇంటూరి, కాకర్ల తదితరులు**













**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నగరంలోని వి ఆర్‌సీ మైదానం భక్తిభావంతో ఉప్పొంగింది. ఆధ్యాత్మిక శోభతో పులకించింది. మూడో రోజు సాయంత్రం అత్యంత వైభవంగా కార్తీక మాస లక్ష దీపోత్సవం సాగింది.
ప్రధాన వేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.
చిన్నారులు తమ నృత్యాలతో సభా ప్రాంగణంలో ఆధ్యాత్మికతను పెంపొందించారు.
ముందుగా వి.ఆర్.సి మైదానానికి చేరుకున్న శ్రీ సౌభాగ్య భువనేశ్వరీ పీఠం పీఠాధిపతులు రామానంద భారతీ స్వామివారు వారికి.. పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి, వేమిరెడ్డి కోటారెడ్డికి కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో అపూర్వ స్వాగతం పలికారు. కార్తీక మాస లక్ష దీపోత్సవానికి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే కంభంపాటి విజయరామిరెడ్డి తదితరులు పాల్గొని ఈ సందర్భంగా ఆకాశ దీపాన్ని వెలిగించారు.
నాగేశ్వరస్వామికి, పండరీనాథ్ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# జిన్నాం హైస్కూల్ విద్యార్థులకు ఐడి కార్డుల పంపిణీ

**- స్పాన్సర్ చేసిన సాయి సిద్ధార్థ కళాశాల**




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** మండలంలోని జిన్నాం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు స్థానిక సాయి సిద్ధార్థ విద్యాసంస్థల కరస్పాండెంట్ సీరంరెడ్డి చంద్రశేఖర్ తన సొంత ఖర్చులతో తయారు చేయించిన ఐడి కార్డులను జిల్లా సమగ్ర శిక్ష ఏపీసి ఏ.రామారావు శుక్రవారం పంపిణీ చేశారు. స్థానిక హై స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఏపీసి రామారావు పాల్గొని 319 మంది విద్యార్థులకు ఐడి కార్డులు అందజేశారు. ఈ విధంగా ముందుకు వచ్చి తన ఉదారతను చాటుకున్న చంద్రశేఖర్ను ఏపీసీ రామారావు అభినందించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌ని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కొంచాడ సన్యాసినాయుడు, ఉపాధ్యాయులు రవి శంకర్, లాల్ బాబు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఎంపీటీసీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కంచిపల్లి శ్రీను హత్య కేసులో 8 మంది ముద్దాయిల అరెస్టు




**అమలాపురం, (రాజధాని వార్తలు):** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలా పురంలో ట్రావెల్ డ్రైవర్ కంచిపల్లి శ్రీను హత్య కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శ్రీను హత్యకు పాల్పడిన నిందితులను, వీరి వద్ద నుంచి మూడు కార్లు, ఒక మోటార్ సైకిల్, 15 సెల్ ఫోన్లు, ఒక కత్తి స్వాధీనం చేసుకున్నట్లు శనివారం అమలా పురంలో మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా తెలిపారు. శ్రీను హత్యకు పాల్పడి అరెస్ట్ కాబడిన నిందితుల వివరాలు. గంగుమల్ల కాసుబాబు, అడబాల శంకర్, సలాది రాంబాబు, భాస్కర్ల దుర్గా నాగ ప్రసాద్, కారాటం నరేష్, ఎర్రంశెట్టి లింగయ్య నాయుడు, మొరం సత్య నారాయణ, మొరం వీర వెంకట శ్రీనివాస్‌లను ఎస్పీ మీడియా సమావేశం ముందు హాజరు పరిచారు. కంచిపల్లి శ్రీను హత్యకు పాల్పడిన వారిని వారి వివరాలను వివరిస్తున్న ఎస్పి మీనా.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
# 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యంఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మండడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్స్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ చి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎక్ష్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి శారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# పిల్లలను గమ్యం చేర్చడం మీ బాధ్యత







**నాయుడుపేట, (రాజధాని వార్తలు):** తిరుపతి జిల్లా, నాయుడుపేటలో స్కూల్ బస్సుల భద్రతపై అవగాహన సదస్సు కార్యక్రమం నాయుడుపేట డీఎస్పీ చెంచు బాబు, ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయుడుపేట, చిట్టమూరు, ఓజిలి మండలాలలోని స్కూల్ బస్సుల భద్రతపై పోలీస్ శాఖ, ఆర్.టి.ఓ సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ సీఐ బాబి, మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణ భద్రతకు బస్సు డ్రైవర్లు, స్కూల్ యాజమాన్యం, తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అత్యంత కీలకమని తెలిపారు. బస్సులు నడిపే డ్రైవర్లు ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేయాలని, పిల్లలను బస్ ఎక్కించేటప్పుడు, దింపడంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనం నడపరాదని, వ్యక్తిగత ఫిట్నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు. లైసెన్స్, వాహనం ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఎమర్జెన్సీ విండో, ఫైర్ సేఫ్టీ వంటి సదుపాయాలు ప్రతి స్కూల్ బస్సులో తప్పనిసరిగా ఉండాలని తెలియజేశారు. అనంతరం ఆర్.టి.ఓ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లలను స్కూల్ బస్సులో పంపేటప్పుడు భద్రతా నియమాలు పాటిస్తున్నారా అనే విషయాన్ని మీరు కూడా గమనించాలని సూచించారు. స్కూల్ యాజమాన్యం అనుభవం కలిగిన డ్రైవర్లు మాత్రమే నియమించాలని, రూల్స్‌ను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. భద్రతా నియమాలు పాటించాలని, పిల్లల ప్రాణాల రక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పోలీస్ శాఖ, ఆర్.టి.ఓ సంయుక్తంగా తెలియజేశారు. అనంతరం ప్రతి బస్సు ఎక్కి బస్సు కండిషన్ ఎలా ఉందో లైట్లు, టైర్లు, బస్సుకు సంబంధించిన పత్రాలు డిఎస్పి, అర్బన్ సీఐ, ఆర్టీవో స్వయంగా తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులు, డ్రైవర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సంధ్యా వేళ దీప ప్రజ్వలనతో లక్ష్మీ కటాక్షానికి మార్గం సుగుమం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** సంధ్యా సమయానా దీపారాధన చేసి లలిత సహస్రనామం, విష్ణు సహస్రనామం లాంటి ధార్మిక పారాయణాలు చేయడం ఇంటిల్లిపాదికి శ్రేయస్కరమని శ్రీ రామానంద భారతి స్వాములవారు సెలవిచ్చారు. నెల్లూరు నగరంలోని వి ఆర్ కళాశాల మైదానంలో వి పి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లక్షదీపోత్సవ కార్యక్రమంలో ఆయన అనుగ్రహ భాషణం చేస్తూ కార్తీక మాసం సందర్భంగా పవిత్ర దీప ప్రజ్వలన పుణ్య కార్యంలో వేలాది మంది ప్రజలను భాగస్వాములను చేసిన వేమిరెడ్డి దంపతులను ఆయన ప్రశంసించారు. ఆధ్యాత్మికత ఉట్టి పడుతున్న విఆర్ కళాశాల ప్రాంగణంలో నియమ నిష్ఠలతో దీపారాధన చేస్తున్న భక్తులను చూస్తుంటే శివుడు కైలాసం వదిలి ఇక్కడే ఉన్నాడా అనిపిస్తుందన్నారు స్వాముల వారు. జ్యోతి ప్రజ్వలన అనేది సనాతన ధర్మంలో ఒక భాగమని కేవలం కార్తీక మాసంలోనే కాకుండా సాధారణ మహిళలు సంధా వేల దీపారాధన అలవాటు చేసుకోవాలన్నారు. రోజు వీలుపడకపోతే కనీసం శుక్రవారం మరియు ఆదివారం దీపారాధన చేయాలని స్వాముల వారు తెలిపారు.

అగ్ని స్వరూపుడైన అరుణాచలేశ్వరుడి ఆరాధనే లక్ష దీపోత్సవ లక్ష్యంమని శ్రీ రామానంద భారతి స్వాములవారు పేర్కొన్నారు. వేమిరెడ్డి దంపతుల సంకల్ప బలానికి భగవత్ అనుగ్రహం తోడై వరుణుడు శాంతించాడని శ్రీ రామానంద భారతి స్వాములవారు తమ అనుగ్రహ భాష్యంలో వెల్లడించారు.

# పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న చిత్తూరు కలెక్టర్‌కి వ్యతిరేకంగా ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విలేకరులపై దురుసుగా మాట్లాడిన చిత్తూరు కలెక్టర్ వైఖరికి వ్యతిరేకంగా తిరుపతిలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తిరుపతి గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎం ప్రసాద్, వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ టి.జనార్ధన్ తిరుపతి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మురళి, తిరుపతి ప్రెస్ క్లబ్ కార్యదర్శి బాలు, ఐజయు జాతీయ కౌన్సిల్ సభ్యులు రాజేంద్ర, ఏపీయూడబ్ల్యూ జే జిల్లా కోశాధికారి చంద్రబాబు, సహాయ కార్యదర్శులు శీను బాబు, కోటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ, బాలయ్య, విశాలాంధ్ర తిరుపతి ఎడిషన్ మేనేజర్ సుబ్బరా యుడు, చిత్తూరు జిల్లా కోశాధికారి వాలీశ్వర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఎల్ ఎస్




ఖాన్, ఉదయ్, జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మోహన్ కుమార్ రాజు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** ప్రభుత్వ వైద్య కళాశాలాలను పిపిపి విధానంలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాడాన్ని వ్యతిరేకిస్తూ సామర్లకోట పట్టణంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వైసీపీ పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో పట్టణంలోని 22, 23, 24, 25, 26 వార్డులకు సభందించి రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ప్రజలందరకు అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందించి ప్రజారోగ్యాన్ని కాపాడిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తూ పేద, మధ్య తరగతుల పిల్లలు వైద్య విద్య పొందలేని విధంగా దూరం చేస్తుందన్నారు. ఈ విధానంతో సామాన్యులు వైద్య విద్యను అందుకోవడం సాధ్యం కాదన్నారు. దానికి గానూ వైసీపీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోటి సంతకాల కార్యక్రమం చేపడుతుండగా దీనికి ప్రజలనుంచి భారీ స్పందన వస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పాగా సురేష్ కుమార్, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు సేపేని రూప, పట్టణ మహిళా అధ్యకురాలు పాలిక కుసుమ, మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోసెస్, నాయకులు, సేపేని సురేష్, మద్దాల శ్రీనివాసరావు, ఇరుసుమళ్ళ సాయి, చిట్టిమాని శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan